సంపుటి : 9
సంచిక : 276
శనివారం
27 జూన్ 2026
పేజీలు : 12
వెల : 2/-

# విశ్వం వాయిస్

E-PAPER

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వం వాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
సులభమైన యాక్సెస్
ఎక్కడైనా ఎప్పుడైనా
తాజా అప్‌డేట్స్ రియల్ టైమ్ లో
తాజా వార్తలు మరియు విశ్లేషణలు
ఉచితం
అన్ని పరికరాల్లో
తక్షణ నోటిఫికేషన్స్
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మీ ఫోన్‌లో మా డిజిటల్ దినపత్రికను పొందండి.
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

## అధికారుల నిర్లక్ష్యపు కోరల్లో 'రైతు' ప్రాణం...

### 14 ఏళ్ళుగా సాగుతున్న సుదీర్ఘ పోరాటం!






**కాకినాడ, విశ్వం వాయిస్ ప్రతినిధి న్యూస్:** ఆయన దేశానికి వెన్నెముక అయిన రైతు. కానీ, వ్యవస్థల నిర్లక్ష్యం ముందు నిస్సహాయుడిగా మిగిలిపోయాడు. తన పొలానికి వచ్చే నీరు, పోయే దారి కోసం ఓ అన్నదాత ఏకంగా 14 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. 11 సార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ కాళు పట్టుకున్నాడు. ఈ 14 ఏళ్ల కాలంలో నాలుగు సార్లు ప్రభుత్వాలు మారాయి, పాలకులూ మారారు.. కానీ ఆ రైతు రాత మాత్రం మారలేదు. అధికారుల ఆదేశాలు కేవలం 'పేపర్ పులులు' లాగా కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప క్షేత్రస్థాయిలో ఆ రైతుకు ఒరిగింది శూన్యం. కాకినాడ జిల్లాలో వెలుగుచూసిన ఈ సుదీర్ఘ ఆక్రందన ప్రభుత్వ యంత్రాంగం యొక్క నిమ్మకు నీరెత్తిన చందానికి మిగతా .. 2లో..

**రైతుల డిమాండ్స్**
- ఆక్రమిత కాలువను వెంటనే పునరుద్ధరించాలి
- ప్రభుత్వ భూమిని, ఆక్రమణల నుండి విముక్తి చేయాలి
- బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రైతుల భూములకు శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలి

## వెంటనే స్పందించి న్యాయం చేయండి!

---

నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద

## ప్రారంభమైన రొట్టెల పండుగ

### ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి నారాయణ



**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని ప్రసిద్ధ బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగ ఘనంగా మొదలైంది. మంత్రి నారాయణ ఈ రొట్టెల పండుగ ఏర్పాట్లను సమీక్షించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం స్వర్ణాల చెరువులో రొట్టెను వదిలి, ఆపై పట్టుకున్నారు. ఆ తర్వాత దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ "412 సంవత్సరాల చారిత్రక నేపథ్యం ఉన్న ఈ దర్గాకు ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. 2014కి ముందు సుమారు 4 లక్షల మంది మాత్రమే వచ్చేవారు, వసతులు సరిగా లేవు. ఇప్పుడు వసతి సౌకర్యాలు, అభివృద్ధి పనులు భారీగా చేపట్టాం" అని తెలిపారు. గత ప్రభుత్వం దర్గా అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన మంత్రి, నెల్లూరు బారాషహీద్ దర్గాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. దేశ-విదేశాల నుంచి భక్తులు నమ్మకంతో వస్తున్నారన్నారు. చెరువు నీటి శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టామని.. 6,315 మున్సిపల్ సిబ్బంది.. 1,870 పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు మిగతా .. 2లో..

## విద్యావ్యవస్థలో మార్పు మీరే తేవాలి

**సింగపూర్ యాత్రకు వెళ్లిన 37 మంది టీచర్లతో మంత్రి లోకేశ్ భేటీ**
**అందరం కలిసి 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' సాధిద్దామన్న లోకేశ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఉపాధ్యాయులే నాయకత్వం వహించాలని, అందరూ కలిసికట్టుగా కృషి చేసి 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లివచ్చిన 37 మంది ఉత్తమ ఉపాధ్యాయులతో ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, సింగపూర్ పర్యటనలో తాము తెలుసుకున్న అధునాతన విద్యా విధానాలు, బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో వాటిని అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను లోకేశ్ ఆసక్తిగా విన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావడంలో మిగతా .. 2లో..

పొగాకు గిట్టుబాటు ధరకు

## ప్రభుత్వం గట్టి భరోసా

**మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా పెట్టాలి**
**పొగాకు రైతుల సమస్యలు, ఎరువుల పంపిణీపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి**
**జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై మిగతా .. 2లో..

## కడప జిల్లాలో ఘోర ప్రమాదం

### ముగ్గురి మృతి



**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** కడప జిల్లాలో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లాలోని పాలెంపల్లె వద్ద ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ముద్రగడను పరామర్శించిన

## బొత్స, తోట త్రిమూర్తులు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో మిగతా .. 2లో..

సాయికృష్ణ కేసు.. నాగరాజుకు సహకరించిన

## ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, స్నేహితుడు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** గాదె సాయికృష్ణ మృతి, శవం మాయం చేసిన కేసులో సిట్ అధికారులు విచారణను వేగవంతం చేశారు. కృష్ణలంక సీఐ నాగరాజుకు హెడ్‌కానిస్టేబుళ్లు అశోక్, నాని, స్నేహితుడు సురేశ్ సహకరించినట్లు సిట్ గుర్తించింది. నాగరాజు అరెస్ట్ తర్వాత అశోక్, నాని అజ్ఞాతంలోకి వెళ్లారు. సీఐకి అసిస్టెంట్‌గా ఉన్న అశోక్ ఇంటికి సిట్ సిబ్బంది వెళ్లగా ఆయన లేకపోవడంతో వెనుదిరిగారు. నానికి ఇటీవలే కృష్ణలంక పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. మే 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు అశోక్, నానితో పాటు సురేశ్ వడ్డేశ్వరం వెళ్లినట్లు సిట్ గుర్తించింది. పరారీలో ఉన్న మిగతా .. 2లో..

## ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు

**ఏపీఎస్డీఎంఏ అలర్ట్**
**ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**

**విశ్వం వాయిస్ న్యూస్ :** వాతావరణ మార్పుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రేపటి (శనివారం) నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ... రేపు ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. భారత మిగతా .. 2లో..




## జగన్ బంగీ జంప్..

**ఆ విషయం అడుగుతానన్న కేటీఆర్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఒక టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ గతంలో జగన్ చేసిన బంగీ జంప్ గురించి ప్రస్తావించారు. తనకు సాహసకృత్యాలంటే ఇష్టమని, భవిష్యత్తులో స్కైడైవింగ్ చేయాలని ఉందని, అయితే బంగీ జంప్ అంటే మాత్రం మిగతా .. 2లో..

ఇరాన్ డ్రోన్ల దాడి..

## తెలివితక్కువ పనే

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ నాలుగు డ్రోన్లతో దాడి చేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఆ డ్రోన్‌లలో ఒకటి.. అత్యంత ఖరీదైన సరకు రవాణా నౌకను బలంగా ఢీకొట్టిందని అన్నారు. నష్టం జరిగినప్పటికీ.. అది తన ప్రయాణాన్ని కొనసాగించిందని తెలిపారు. మరో 3 డ్రోన్లను తాము కూల్చివేశామని మిగతా .. 2లో..

## వెనెజువెలా కోసం భారత్.. 'ఆపరేషన్ అమిస్టాడ్'



**విశ్వం వాయిస్ న్యూస్ :** భూకంపంతో అతలాకుతలమైన వెనెజువెలాకు ఆయా దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా లాటిన్ అమెరికా దేశానికి ఆపన్న హస్తం అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 'ఆపరేషన్ అమిస్టాడ్' కొనసాగుతోందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. ఇందులో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత సైన్యానికి చెందిన రెండు సీ17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆసుపత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# అధికారుల నిర్లక్ష్యపు కోరల్లో 'రైతు' ప్రాణం..

నిలువుటద్దంగా నిలుస్తోంది.

**కన్నీటి గాథ.. కాలువ ఆక్రమణ!**

వివరాల్లోకి వెళితే.. కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన లిపోకల సర్వారాయుడులి అనే రైతుకు వ్యవసాయమే జీవనాధారం. తన తాత ముత్తాతల కాలం నుండి సుమారు ఒక కిలోమీటర్ మేర ఉన్న సాగునీటి పారుదల, డ్రైనేజీ కాలువను కొంతమంది స్థానిక దౌర్జన్యపరులు అక్రమంగా ఆక్రమించి పూడ్చివేశారు. దీనివల్ల సర్వారాయుడు కుటుంబానికి చెందిన 15 ఎకరాల భూమిలో సాగునీరు బయటకు వెళ్లే దారి లేక, ప్రతి ఏటా పంటలు మునిగిపోయి కుళ్లిపోతున్నాయి. పంట పండక, కుటుంబ పోషణ భారమై సదరు రైతు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. ఈ అన్యాయంపై ఆయన మొదటిసారిగా లిఆగస్టు 22, 2012లి నాటి ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి జిల్లా కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. అప్పటి నుండి నేటివరకు (2026) సుమారు 11 సార్లు కలెక్టర్‌ను కలిసి మొరపెట్టుకున్నారు.

**శాఖల మధ్య 'నెపం'.. సర్వేల ప్రహసనం!**

ఈ సమస్యపై స్పందించిన జిల్లా కలెక్టర్.. కాలువను వెంటనే సర్వే చేసి, ఆక్రమణలు తొలగించి పునరుద్ధరించాలని మూడు ముఖ్య శాఖలను ఆదేశించారు.

రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి శాఖలు రంగంలోకి దిగాయి. అయితే, ఈ మూడు శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాల్సింది పోయి, సమస్యను ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ కాలయాపన చేశారు. కొంతకాలం తర్వాత మొక్కుబడిగా సర్వే నిర్వహించిన అధికారులు..

**"అక్కడ అసలు కాలువే లేదు"**

అంటూ విడ్డూరమైన నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్నారు. తరతరాలుగా కిలోమీటర్ పొడవునా పారిన కాలువ, అధికారుల సర్వే రికార్డుల్లో మాయమైపోవడం వెనుక ఉన్న అంతర్యమేమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

**ముఖ్యమంత్రి ఆదేశాలనూ బేఖాతరు చేస్తారా?**

అధికారుల నివేదిక ఎంత అడ్డగోలుగా ఉందో చెప్పడానికి గతంలో జరిగిన ఒక సంఘటనే నిదర్శనం. సెప్టెంబర్ 2024లో వచ్చిన భారీ వరదల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాంతంలో పర్యటించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో.. ఈ కాలువ ఆక్రమణల వల్లే ఇక్కడ తీవ్ర ముంపు సంభవించిందని ముఖ్యమంత్రి స్వయంగా గుర్తించారు. కాలువ ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.

**రైతుల సూటి ప్రశ్నలు:**

ముఖ్యమంత్రి గారే స్వయంగా కాలువ ఆక్రమణను గుర్తించి ఆదేశాలిస్తే, అప్పుడు ఆయన ఎదుట "ఇక్కడ కాలువ లేదు" అని అధికారులు ఎందుకు చెప్పలేకపోయారు?

సీఎం ఆదేశాల కంటే క్రింది స్థాయి అధికారుల లీలలే పెద్దవా?

**ఇప్పటికైనా స్పందించేనా..?**

ప్రభుత్వ భూమిగా స్పష్టమైన ఆధారాలున్న కాలువ ప్రాంతాన్ని పాత పద్ధతిలోనే వెడల్పు చేసి, తమ భూములను ముంపు నుండి కాపాడాలని రాజుపాలెం గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగితాల మీద కబుర్లు చెప్పే 'పేపర్ పులులు' లాంటి అధికారులు ఇప్పటికైనా మానవతా దృక్పథంతో ఆలోచించి, 14 ఏళ్ల ఒక రైతు పోరాటానికి, ఆక్రందనకు చరమగీతం పాడాలని సర్వత్రా కోరుతున్నారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

# విద్యావ్యవస్థలో మార్పు మీరే తేవాలి

ఉపాధ్యాయుల పాత్రే అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం తప్పకుండా గుర్తింపునిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర విద్యారంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

# ప్రభుత్వం గట్టి భరోసా

సమీక్ష నిర్వహించారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు. 2026--27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఖీజు పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద ప్రారంభమైన రొట్టెల పండుగ

తెలిపారు. భద్రతకు గజ ఈతగాళ్లను సిద్ధం చేశామని, బోట్ షికారు కోసం 8 రకాల బోట్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని, అందరూ సుఖంగా ఉండాలని సంకల్పించి రొట్టె పట్టుకున్నట్లు మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు.

# ముద్రగడను పరామర్శించిన బొత్స, తోట త్రిమూర్తులు

చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల సత్వర పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ఈ వార్త తెలియగానే పలువురు వైసీపీ సీనియర్ నేతలు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఈరోజు ఆసుపత్రికి వెళ్లారు. ముద్రగడ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల నుంచి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ముద్రగడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం పట్ల వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, స్నేహితుడు

ముగ్గురి కోసం అధికారులు గాలిస్తున్నారు. వడ్డేశ్వరం వెళ్లిన సీసీ ఫుటేజ్‌ను సిట్ స్వాధీనం చేసుకుంది. సీడీఆర్, సీసీ ఫుటేజ్ ఆధారంగా ఈ కేసులో ఈ ముగ్గురూ కీలకంగా వ్యవహరించినట్లు సిట్ అధికారులు గుర్తించారు.

# ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు

వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా రానున్న కొద్దిరోజుల పాటు ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తన నివేదికలో పేర్కొంది. ఆదివారం (జూన్ 28) కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# జగన్ బంగీ జంప్..

ఎంతో భయమని ఆయన వెల్లడించారు. కేవలం ఒకే తాడుపై ఆధారపడి కిందకు దూకడం చాలా భయానకంగా అనిపిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జగన్ చేసిన బంగీ జంప్ అంశాన్ని గుర్తుచేసుకుంటూ, "అది జగన్‌కు ఎలా సాధ్యమైందో నాకు అర్థం కావడం లేదు. ఆయన్ను కలిసినప్పుడు దీని గురించి తప్పకుండా అడుగుతాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్యారాచూట్ సహాయంతో చేసే స్కై డైవింగ్ కంటే బంగీ జంప్ క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే ఇంటర్వ్యూలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవలి మౌనంపై కూడా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ మౌనాన్ని "గోడకు వేలాడుతున్న తుపాకీ"తో ఆయన పోల్చారు. సమయం వచ్చినప్పుడు అది తప్పకుండా గర్జిస్తుందని, ప్రస్తుతం ఆయన మార్గదర్శకత్వంలోనే తామంతా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ప్రతి సందర్భంలోనూ నాయకుడు ముందుండాల్సిన అవసరం లేదని, అసలైన నాయకుడు వెనుక ఉండి నడిపిస్తారని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఇరాన్ డ్రోన్ల దాడి.. తెలివితక్కువ పనే

అన్నారు. ఇరాన్ తెలివితక్కువ పని చేసిందని.. ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. మరోవైపు, సుంకాలకు సంబంధించి ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా కంపెనీల డిజిటల్ సేవలపై పన్ను విధిస్తే.. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 100శాతం పన్ను వేస్తానని హెచ్చరించారు. వారితో వాణిజ్య ఒప్పందాలు అమల్లో ఉన్నా.. ఇప్పటికే సంతకం చేసినా.. చేయకున్నా.. వాటిపై సుంకాలు తప్పవన్నారు. కొన్ని ఐరోపా దేశాలు అమెరికా కంపెనీలపై పన్ను విధించే అంశాన్ని చర్చిస్తున్నాయని పేర్కొంటూ.. ట్రంప్ ఈ హెచ్చరికలు చేశారు.

# వెనెజువెలా కోసం భారత్.. 'ఆపరేషన్ అమిస్టాడ్'

సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలు పంపించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయంలో వెనెజువెలా ప్రభుత్వానికి, అక్కడి పౌరులకు అవసరమైన సాయం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అమిస్టాడ్ అంటే స్పానిష్ భాషలో స్నేహం అని అర్థం. వరుస భూకంపాల ధాటికి వెనెజువెలాలో భారీ భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల్లో చిక్కుకున్న వారిని సాధ్యమైనంత త్వరగా బయటకు తీసేందుకు భారీ నిర్మాణ పరికరాలు అవసరమని, వీటిని అందుబాటులో ఉంచాలని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ అక్కడి వ్యాపార సంస్థలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, అమెరికా, చిలీ, స్విట్జర్లాండ్, తుర్కియే నుంచి సహాయక బృందాలు ఇప్పటికే వెనెజువెలా చేరుకొని రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఖతార్, బ్రెజిల్, స్పెయిన్, పోర్చుగల్, కెనడా దేశాధినేతలు కూడా తమ బృందాలను పంపిస్తామని ప్రకటించారు.

# ఆశ ఒక సంజీవని... ఆచరణ ఒక ఆయుధం!

ఆశ ఒక సంజీవని... ఆచరణ ఒక ఆయుధం!

మానవ హృదయాంతరాళాలలో ఎప్పుడూ ఒక దీపం నిరంతరం వెలుగుతూనే ఉంటుంది. అదే ఆశ . చీకటి ముసిరిన వేళ, కష్టాల కడలి ఉప్పొంగిన తరుణంలో, రేపటి రోజు నాది, నా జీవితం మారుతుంది, ఈ కన్నీళ్ళు కరిగిపోతాయి అని మనిషిని నిలబెట్టే ఏకైక సంజీవని ఆశ. కానీ, కేవలం ఆశపడితేనే సరిపోతుందా? పట్టువదలని విక్రమార్కుడిలా కలలు కంటూ కూర్చుంటే గమ్యస్థానం చేరుకోగలమా? అస్సలు సాధ్యం కాదు. నిశ్చయాత్మకమైన నిజం ఏమిటంటే ఈ సృష్టిలో భవిష్యత్తును బంగారుమయం చేసేది కేవలం ఆశ అనే అమృత భావన కాదు, అలుపెరుగని చర్య . అడుగు ముందుకు వేయడమే అసలైన పరివర్తనకు ప్రథమ బీజం.మన కళ్లముందు కదలాడే ప్రతి మహాసాధకుడూ ఒకప్పుడు సగటు మనిషిగా, సామాన్యుడిగానే జీవితాన్ని ప్రారంభించాడు. మరి వారిని చరిత్ర పుటల్లో నిలిపిన ఆ రహస్యం ఏమిటి? వారు కేవలం ఆశ అనే పల్లకిలో ఊరేగలేదు,ఆ ఆశను ఆచరణకు నిచ్చెనగా మార్చుకుని శిఖరాగ్రాలకు చేరుకున్నారు. క్రియాశీలత లేని ఆశ ఎండమావి లాంటిది, నీటిపై రాసిన రాత లాంటిది క్షణ కాలంలోనే అదృశ్యమైపోతుంది. కానీ, ఉరుకులు పరుగుల ఆచరణతో కూడిన ఆశ రాతిపై చెక్కిన శాసనం లాంటిది. యుగాలు గడిచినా, శతాబ్దాలు మారినా దాని ప్రకాశం అస్సలు చెరగదు.అసలు ఆశ అంటే ఏమిటి? ఆచరణ లేదా చర్య అంటే ఏమిటి? ఈ రెండింటి మధ్య ఉన్న సూక్ష్మ బేధాన్ని గమనించాలి. ఆశ అనేది గాయపడిన మనసుకు లభించే ఒక మధురమైన సాంత్వన. నిరాశానిస్పృహల అగాధంలో కూరుకుపోకుండా మనిషిని నిలబెట్టే మానసిక ఆలంబన. సుడిగుండాల వంటి కష్టాలలో ఉన్నప్పుడు నిశ్చయంగా రేపు బాగుంటుంది అని గుండెల్లో ధైర్యాన్ని నింపే అద్భుత శక్తి ఆశ. ఇది కచ్చితంగా అవసరం ఇది మానవత్వంలో, మనుగడలో ఒక అనివార్య భాగం.కానీ, ఒక్క క్షణం ఆలోచించండి, ఒట్టి ఆశ మాత్రమే జీవిత నౌకను ముందుకు నడపగలదా? ఒక కర్షకుడు ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి అని ఆశించి, పొలాన్ని దున్నకుండా, చెమటోడ్చకుండా, విత్తనాలు చల్లకుండా కేవలం ఆకాశం వైపు చూస్తూ కూర్చుంటే పంట పండుతుందా? పరీక్షల్లో సర్వోత్తమ ర్యాంకు సాధించాలని ఆశించే విద్యార్థి, పుస్తకం వైపు కన్నెత్తి కూడా చూడకుండా కాలక్షేపం చేస్తే ఉత్తీర్ణత లభిస్తుందా? ఆశ వెనుక అచంచలమైన చర్య లేకపోతే, అది కేవలం పగటి కలగానే మిగిలిపోతుంది తప్ప, కఠిన వాస్తవంగా రూపాంతరం చెందలేదు.మరోవైపు, చర్య లేదా ఆచరణ అంటే ఏమిటి? అది హృదయంలోని స్వప్నాన్ని సజీవ సత్యంగా మార్చే ఒక అద్భుతమైన వంతెన. ఎంతటి సుదీర్ఘమైన ప్రయాణమైనా ఒక చిన్న అడుగుతోనే కదా ప్రారంభమయ్యేది? ఆ చిన్న అడుగు ముందుకు వేయడమే అసలైన చర్య. మదిలో మెదిలిన అద్భుత ఆలోచనను కార్యాచరణ రూపంలోకి అనువదించడం, కాలమనే అమూల్యమైన సంపదను సద్వినియోగం చేసుకోవడం, ఎన్ని అడ్డంకులు, అవమానాలు ఎదురైనా వెనుతిరగకుండా పోరాడటం ఇవే నిఖార్సైన క్రియాశీలతకు ఉన్న అసలైన లక్షణాలు.కాలగర్భంలో కలిసిపోయిన చరిత్ర పుటలను ఒకసారి తిరగేస్తే, ప్రపంచాన్ని శాసించిన, సమాజాన్ని మార్చిన మహానుభావులందరిలో ఒక సాధారణ గుణం మనకు స్పష్టంగా గోచరిస్తుంది. వారు కేవలం ఊహల పల్లకీల్లో విహరించలేదు. తమ కలలను సాకారం చేసుకోవడానికి రాత్రింబవళ్ళు నిరంతరం శ్రమించారు, రక్తాన్ని చెమటగా మార్చారు.భారత జాతి పిత మహాత్మా గాంధీకి దేశానికి స్వాతంత్ర్యం వస్తుందనే బలమైన ఆశ ఉండింది. కానీ ఆ నిశ్శబ్ద ఆశ మాత్రమే బ్రిటీష్ సామ్రాజ్య సంకెళ్ళను తెంచలేదు. ఆయన నడుం బిగించి దండి యాత్రలో అడుగులు వేశారు, లాఠీ దెబ్బలకు వెరవక జైలు గోడల మధ్య శ్రమించారు, సత్యాగ్రహ ఆయుధంతో పోరాడారు. ఆ నిరంతర ఆచరణే మనకు స్వేచ్ఛా వాయువులను ప్రసాదించింది.అలాగే, నవభారత శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమాజంలో సమానత్వాన్ని ఆశించారు. కానీ ఆ ఆశను నెరవేర్చుకోవడానికి ఆయన ఎన్నో అవమానాలను భరిస్తూ, రాత్రి పగలు తేడా లేకుండా చదివారు, అణగారిన వర్గాల కోసం పోరాడారు, చివరకు భారతదేశానికి సర్వోత్కృష్టమైన రాజ్యాంగాన్ని అందించారు. అది ఆశను శాసనంగా మార్చిన అద్భుత ఆచరణ.మన తెలుగు నేల వైపు చూస్తే, గోదావరి నది ఉప్పెనలకు అల్లాడిపోతున్న రైతాంగాన్ని చూసి చలించిన సర్ ఆర్థర్ కాటన్ కేవలం సానుభూతితో ఆగిపోలేదు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టి, కోటి ఎకరాలను సస్యశ్యామలం చేశారు. కృష్ణా గోదావరి నదుల తీరాల్లోని మన పూర్వీకులు ఆశను నమ్మి కూర్చోలేదు, శ్రమను నమ్మి కదంతొక్కారు. ఆ భగీరథ ప్రయత్నమే నేడు తెలుగు గడ్డను అన్నపూర్ణగా నిలిపింది.రేపు చేద్దాంలే ,ఈరోజు సమయం బాగాలేదు,పరిస్థితులు చక్కబడ్డాక ప్రయాణం మొదలుపెడతాను ఇవన్నీ ఆచరణను వాయిదా వేయడానికి మనిషి వెతుక్కునే ఆత్మవంచన సాకులు. ఈ వాయిదా పద్ధతి అనేది మనల్ని ఏ వయసులోనూ విడిచిపెట్టని ఒక మిత్రద్రోహి.నిరీక్షణ అనే ఊబిలో మనం కోల్పోయే అత్యంత విలువైన వస్తువు సమయం. గడిచిన కాలం గంగా ప్రవాహం లాంటిది, అది ఎప్పటికీ తిరిగి రాదు. నిన్న నువ్వు వేయని అడుగు, నేడు నిన్ను రెండింతల శ్రమ అడుగుతుంది. వాయిదా వేసే ప్రతి క్షణం, నువ్వు సాధించాల్సిన ఒక సువర్ణ అవకాశాన్ని సమాధి చేస్తుంది.ముఖ్యంగా నేటి యువతరానికి ఈ సత్యం బోధపడాలి. యువతరం అంటేనే అంతులేని ఉత్సాహం, నరనరాల్లో ప్రవహించే అపారమైన శక్తి. ఈ సువర్ణ కాలాన్ని తర్వాత చూద్దాం అంటూ సామాజిక మాధ్యమాల్లోనో, వ్యర్థ ప్రసంగాల్లోనో వృథా చేస్తే, ఆ ఉత్సాహం మళ్ళీ తిరిగి రాదు. రేపు మొదలు పెడతాను అని నిత్యం పలవరించే వ్యక్తి, తన జీవితంలో ఎప్పటికీ గమ్యాన్ని చేరలేడు, చరిత్రలో ఒక సాధారణ పౌరుడిగానే మిగిలిపోతాడు.ఆచరణకు, విజయానికి మధ్య నిలిచే అతి పెద్ద శత్రువు భయం. వైఫల్యం ఎదురవుతుందేమోననే ఆందోళన, సమాజం చూసి నవ్వుతుందేమోననే సిగ్గు, నష్టపోతామేమోననే ఆత్మాన్యూనతా భావం ఇవే మనిషిని కదలకుండా చేసే బంధనాలు.

కానీ ప్రతి గొప్ప ఆవిష్కరణ వెనుక వేలాది వైఫల్యాల గాథలు దాగి ఉన్నాయి. విద్యుత్ దీపాన్ని కనుగొన్న థామస్ అల్వా ఎడిసన్ వేల సార్లు విఫలమయ్యారు. కానీ ఆయన ఎన్నడూ నిరాశతో ఆగిపోలేదు. నేను ఓడిపోలేదు, పనిచేయని పదివేల మార్గాలను విజయవంతంగా కనుగొన్నాను అని గర్వంగా ప్రకటించారు. వైఫల్యం అనేది ఆచరణకు ముగింపు పలికే ఫుల్‌స్టాప్ కాదు, అనుభవాన్ని నేర్పే కామా మాత్రమే.మన తెలుగు సమాజంలో ఒక అద్భుతమైన సామెత ఉంది. ఆడితే పాడుపోవు, ఆడకపోతే పాడుపోయినట్టే. ప్రయత్నించి ఓడిపోయినా అనుభవం మిగులుతుంది, కానీ ప్రయత్నించకుండానే భయంతో వెనకడుగు వేస్తే జీవితమే వృథా అయిపోతుంది.చాలామంది అనుకుంటారు, ఏదైనా పెద్ద కార్యం సాధించాలంటే ఒకేసారి హిమాలయమంత పని చేయాలని. కానీ అది తప్పు. వేయి మైళ్ళ సుదీర్ఘ ప్రయాణమైనా సరే, కేవలం ఒకే ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది. ఆ మొదటి అడుగే అత్యంత సాహసోపేతమైనది, ప్రాధాన్యమైనది.మీ జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యం ఉందా? అయితే ఆ లక్ష్య సాధన కోసం ఈరోజే, ఇప్పుడే ఒక చిన్న పనిని ప్రారంభించండి. మీరు ఒక నూతన వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంటున్నారా? అయితే ఈ రోజే మార్కెట్ స్థితిగతులను అధ్యయనం చేయడం మొదలుపెట్టండి. చదువులో రాణించాలనుకుంటున్నారా? ఈ రోజే మీ స్మార్ట్‌ఫోన్‌ను పక్కన పెట్టి ఒక గంట అదనంగా పుస్తకాలతో గడపండి. శారీరక దృఢత్వాన్ని ఆశిస్తున్నారా? అయితే ఈ రోజే నడకను ప్రారంభించండి. నేడు మీరు ఆచరణలో పెట్టే ఒక చిన్న పనైనా, రేపటి వెయ్యి ఆశల కన్నా ఎంతో శక్తివంతమైనది.ఆశ మనకు ప్రాణాన్ని ఇస్తుంది కానీ ఆచరణ మనల్ని మహోన్నతులుగా తీర్చిదిద్దుతుంది. ఆశ మన కళ్ళకు రంగుల కలలను చూపిస్తుంది కానీ ఆచరణ ఆ కలలను నిజం చేసి, నిలబడటానికి బలమైన నేలను ఇస్తుంది.చరిత్ర గమనంలో ఏ ఒక్క గొప్ప వ్యక్తి కూడా నేను ఏదో జరుగుతుందని ఆశించాను అని చెప్పి కీర్తి గడించలేదు. నేను కష్టపడి ఈ కార్యాన్ని సాధించాను అని గర్వంగా నిలిచినవారే చరిత్ర పుటల్లో అమరులయ్యారు. ఆచరణే చరిత్ర, ఆచరణే నీ వ్యక్తిత్వం, ఆచరణే నీ అసలైన ఆశకు సజీవ రూపం.కాబట్టి, హృదయంలో దాగి ఉన్న నిగూఢ లక్ష్యం వైపు ఈ క్షణం నుంచే అడుగులు వేయండి. కాలం కోసం వేచి చూడకండి, పరిస్థితులకు తలవంచకండి. కేవలం అదృష్టాన్ని నమ్మి ఆశలపై ఆధారపడకండి వెంటనే కార్యాచరణకు దిగండి. ఎందుకంటే, మీ ఉజ్వల భవిష్యత్తును నిర్మించేది కేవలం ఆశ అనే ఊహ కాదు.అలుపెరుగని ఆచరణ మాత్రమే!



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ఎర్ర చందన అక్రమ రవాణా నిరోధక దళం

**రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం**

**అనంతపురం జిల్లా బొంతవాడ గ్రామ శివార్లలో 108 ఎర్రచందనం దుంగలు డంప్ పై టాస్క్ ఫోర్స్ దాడి.. ముగ్గురు అనంతపురం జిల్లా స్మగ్లర్లు అరెస్ట్ – కారును సీజ్ చేసిన టాస్క్ ఫోర్స్**





**అనంతపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎర్ర చందనం అక్రమ రవాణా ను అడ్డు కోవడంలో ప్రతేక ఆపరేషన్ చేపట్టిన రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అనంతపురం జిల్లాకు చెందిన నల్లాని నంద కుమార్( 32) S/o లేట్ నల్లని రామకృష్ణయ్య, D. No. 1-311, రేగిడి కొత్తూర్ గ్రామం పంచాయతి, పొడరాళ్ల పోస్ట్, బుక్కరాయ సముద్రం మండల, అనతపురం జిల్లా, అతని తో పాటు నల్లాని జయ రామయ్య, బొట్టు రాఘవేంద్ర లను ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరికించి డిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్న ప్రధాన స్మగ్లింగ్ నెట్‌వర్క్ బట్టబయలు. టాస్క్ ఫోర్స్ బృందాన్ని టాస్క్ ఫోర్స్ హెడ్ శ్రీ యల్. సుబ్బ రాయుడు ఐ.పి.యస్ గారు ప్రత్యేకంగా అభినందించి రివార్డు లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్ర చందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో, ఎర్ర చందన అక్రమ రవాణా నిరోధక దళం హెడ్ ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, ఆర్ఎస్ఏఎస్టీఎఫ్ ఎస్పీ. . పీ. శ్రీనివాస్ ఐపీఎస్ , ఆడిషినల్ జె. కులశేఖర్ ఆధ్వర్యం లో శేషాచల అడవులలో ఎప్పటికప్పుడు ప్రత్యేక ఆపరేషన్ లు నిర్వహించడం తో పాటు, ఎర్ర చందనం కేసు లలో ముద్దాయిలు గా ఉంటూ తప్పించుకొని తిరుగుతున్న అంతర రాష్ట్ర స్మగ్లర్లను చట్టం ముందు నిలబెట్టడమే లక్ష్యంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా నిన్నటి దినం అనగా 24.06.2026 వతేదీ సాయంత్రం టాస్క్ ఫోర్స్ బృందం మరియు అటవీ సిబ్బంది కి రాబడిన ఖచ్చితమైన సమాచారంతో ముగ్గురు వ్యక్తులను అనంత పురం జిల్లా, నార్పల మండలం, బొందల వాడ గ్రామ పొలిమేరలో అదుపులోకి తీసుకోని వారి నుండి ఒక కారు తో సహా 109 ఎర్రచందనం దొంగలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. పై తెలిపిన ముద్దాయిలు ఒక ముఠా గా ఏర్పడి ఎర్ర చందనం చెట్లు నరికించి వాటిని డంప్ గా చేసి ఎక్కువ మొత్తం లో డబ్బులకు డిల్లీ, తమిళనాడు కర్ణాటక కు చెందిన భడా ఎర్ర చందనం స్మగ్లర్లు కు అమ్ముకుందాం అని కూలీల ద్వారా శేషాచలం అడవిలో ఎర్ర చందనం చెట్లు నరికించి వాటిని దుంగలు గా చేసి వాటిని అనంత పురం జిల్లా, నార్పల మండలం, అనంత పురం డివిజన్, రేంజ్ , ఫారెస్ట్ సెక్షన్, దుర్గం ఫారెస్ట్ బీటు పరిధి లో బొందల వాడ గ్రామము నుండి బొమ్మలాట పల్లి గ్రామానికి వెళ్ళు మట్టి రోడ్డు మార్గం లో జయరామయ్య కు చెందిన పొలంలో ఉన్న ఒక రేకుల షెడ్ పక్కన డంప్ చేసి దాచిన 109 ఎర్ర చందనం దుంగల తో సహా పై ముగ్గురు వ్యక్తులను మరియు ఒక కార్ ను స్వాదినం చేసుకోవడం అయినది. డిల్లీ, తమిళనాడు మరియు కర్ణాటక లోని ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. పట్టుబడిన మొత్తం 109 ఎర్రచందం దుంగలు వాహనము తో సహా విలువ సుమారు 02 కోట్లు గా ఉంటుందని అంచనా వేయడం జరిగింది. ఈ స్మగ్లింగ్ లో ఇతర ప్రధాన సూత్రధారులను గుర్తించి వారిని అరెస్ట్ చేయడం జరుగుతుంది. అందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కేసు లో ఎర్ర చందనం దొంగలు, వాహనం ను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అంతర రాష్ట్ర స్మగ్లర్ ను అరెస్ట్ చేసిన టాస్క్ ఫోర్స్ బృందాన్ని అభినందించడం తో పాటు వారికి రివార్డ్ లు ఇవ్వడం జరుగుతుంది. ముమ్ముందు కూడా ఎర్ర చందనం అక్రమ రవాణా నివారణ మరియు స్మగ్లింగ్ చేసే వారి పై కఠిన చర్యలు కొనసాగుతుంది.

# ఎడిటర్ వాయిస్

## అవినీతి అంతమైతేనే అభివృద్ధికి అసలైన ఆరంభం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఏర్పడతాయి. ప్రజలు చెల్లించే పన్నులతో ప్రభుత్వ యంత్రాంగం నడుస్తుంది. అయితే ప్రజలకు చేరాల్సిన అభివృద్ధి ఫలాలు మధ్యలోనే అవినీతి అనే చీకటి గోడను ఢీకొంటున్నాయి. అందుకే అవినీతి నేడు దేశాభివృద్ధికి అతిపెద్ద శత్రువుగా మారింది.

అవినీతి అనేది కేవలం డబ్బు తీసుకోవడం లేదా ఇవ్వడం మాత్రమే కాదు. అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించడం, బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం, అర్హులకు అన్యాయం చేసి అనర్హులకు లబ్ధి చేకూర్చడం, ప్రజా ధనాన్ని వృథా చేయడం కూడా అవినీతిలో భాగమే. దీని ప్రభావం ప్రభుత్వ కార్యాలయాల నుంచి విద్య, వైద్యం, నిర్మాణాలు, సంక్షేమ పథకాలు వరకు ప్రతి రంగంపైనా కనిపిస్తోంది.

అవినీతి వల్ల నిజాయితీగా పనిచేసే ఉద్యోగులు నిరుత్సాహానికి గురవుతారు. యువతలో వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది. ప్రజల్లో చట్టాల పట్ల గౌరవం దెబ్బతింటుంది. చివరికి నష్టపోయేది సాధారణ పౌరుడే. అవినీతిని అరికట్టే బాధ్యత ప్రభుత్వానిదే కాదు. లంచం ఇచ్చేవాడు, తీసుకునేవాడు ఇద్దరూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారనే విషయాన్ని ప్రతి పౌరుడు గుర్తించాలి. చిన్న పని కోసం లంచం ఇవ్వడాన్ని సాధారణంగా తీసుకోవడం కూడా అవినీతికి బలం చేకూర్చడమే. ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేసే సంస్కృతి పెరగాలి. పారదర్శక పరిపాలన, డిజిటల్ సేవలు, కఠిన చర్యలు అవినీతిని తగ్గించే మార్గాలు.

స్వతంత్ర మీడియా ఈ పోరాటంలో కీలక పాత్ర పోషిస్తుంది. నిజాలను వెలికితీయడం, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ప్రజా ధన దుర్వినియోగాన్ని ప్రశ్నించడం మీడియా బాధ్యత. ప్రజల తరఫున నిలబడి ప్రశ్నించే కలం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం.

అవినీతి రహిత సమాజం ఒక్కరోజులో ఏర్పడదు. కానీ ప్రతి పౌరుడు నిజాయితీని ఆచరిస్తే, ప్రతి అధికారి తన బాధ్యతను నిర్వర్తిస్తే, ప్రతి ప్రజాప్రతినిధి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటే



ఆ లక్ష్యం సాధ్యమే. అవినీతిపై మౌనం వహించడం కూడా ఒక విధంగా అవినీతికి సహకరించినట్టే. ప్రశ్నించే సమాజమే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## అమలాపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**పాలగుమ్మి వద్ద కారు బోల్తా.. ఒకరి మృతి - పెళ్లికి వస్తుండగా విషాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బంధువుల వివరాల ప్రకారం, హైదరాబాద్ నుంచి అమలాపురంలో జరిగే ఓ వివాహానికి హాజరయ్యేందుకు కారులో వస్తుండగా పాలగుమ్మి వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అమలాపురం రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## గోదావరిలో దూకి వివాహిత ఆత్మహత్య



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఐ.పోలవరం మండలం ఎదుర్లంక జి.ఎం.సి. బాలయోగి వారధి పైనుంచి గోదావరిలో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. కొమరగిరి లైన్‌పేటకు చెందిన కలవల దుర్గా భవాని (33) ఈ ఆత్మహత్య పాల్పడింది. అయితే స్థానిక మత్స్యకారులు ఆమె గోదావరిలో దూకడాన్ని గమనించి వెంటనే రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే ఆమె నీటిలో మునిగిపోవడంతో ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు మృతురాలు గత కొంతకాలంగా మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆమె భర్త, ఆటో డ్రైవర్ విజయకుమార్ పోలీసులకు తెలిపాడు. ఆసుపత్రికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన భవాని అనంతరం వారధి వద్దకు చేరుకుని గోదావరిలో దూకినట్లు వివరించాడు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## నల్గొండలో భార్యాభర్తలు, పిల్లలను చంపింది ఒక్కడే..



**నల్గొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. దంపతులతో పాటు ఇద్దరు పిల్లలను చంపింది ఒక్కడేనని నిర్ధరించారు. ఇటీవల నల్గొండ తెలంగాణ కాలనీలోని ఇంట్లో భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్ (45), హసీనా (38)తో పాటు వారి కుమారుడు ముజామిల్ (20), కుమార్తె అఫోర (14) హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈనెల 20న తెల్లవారుజామున హత్యలు జరగ్గా.. 22న ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితుడు సయ్యద్ అస్లాం, అతడి భార్య తబస్సుమ్‌తో పాటు వారికి పరోక్షంగా సహకరించిన సోహైల్, హేమంత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్థిక లావాదేవీల కారణంగానే అస్లాం ఘాతుకానికి పాల్పడ్డాడు. అక్క కుమార్తె తబస్సుమ్, అస్లాంకు హసీనా ఏడాది క్రితం రూ.లక్ష అప్పు ఇచ్చారు. ఇటీవల మరో రూ.లక్ష కావాలని సుల్తాన్, హసీనా దంపతులను అస్లాం అడిగాడు. దానికి హసీనా నిరాకరించారు. గతంలో ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని కోరారు. డబ్బు కోసం ఒత్తిడి చేశారని తబస్సుమ్, అస్లాం వారిపై పగ పెంచుకున్నారు. అస్లాం యూట్యూబ్‌లో చూసి హత్యలకు పథకం పన్నాడు. ఈనెల 20 తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన హసీనాను తొలుత చంపాడు. ఆ తర్వాత అరుపుల శబ్దం విని బయటకు వచ్చిన సుల్తాన్, ముజామిల్‌ను కూడా అంతమొందించాడు. ఇంట్లో ఉన్న అఫోరను కూడా వదల్లేదు. ఇంట్లోకి వెళ్లి మరీ మంచం కింద దాక్కున్న అఫోరను కడతేర్చాడు. ఈ హత్యల తర్వాత ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలను అస్లాం దోచుకెళ్లాడు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తులతో దాడి.. తీవ్రగాయాలు

**పెద్దపప్పూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తులతో దాడి జరిగింది. పెద్దపప్పూరు మండలం వరదాయ పల్లెలో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ వెంకట నారాయణపై దుండగులు కత్తులు, కొడవళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం వెంకట నారా యణను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పేకాట స్థావరంపై దాడి, జూదరులు అరెస్ట్



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం - అనాతవరం చివారులో పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి చేసిన ఎస్.ఐ జ్వాలా సాగర్.. 8మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్దనుండి 16,000 /- రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.

## గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లో ఘోర ప్రమాదం



**ఇద్దరి మృతి**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాంగ్ రూట్‌లో వచ్చిన ఓ ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇవాళ ఉదయం వినోద్ తన బుల్లెట్‌పై గచ్చిబౌలి వైపు నుంచి కొండాపూర్ ఏఎంబీ ఫ్లైఓవర్ మీదుగా హఫీజ్‌పేట్ మార్గంలో వెళ్తున్నారు. అదే సమయంలో హఫీజ్‌పేట్ వైపు నుంచి గచ్చిబౌలి వైపునకు శ్రీకాంత్, విఠల్ స్కూటీపై ప్రమాదకరంగా రాంగ్ రూట్‌లో వచ్చారు. ఫ్లైఓవర్‌పై వేగంగా వెళ్తున్న బుల్లెట్ బైక్‌ను వేగంగా వచ్చిన స్కూటీ అతి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న శ్రీకాంత్ అతని వెనుక కూర్చున్న విఠల్ ఇద్దరూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించారు. బుల్లెట్ నడుపుతున్న వినోద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఒకరికి తెలియకుండా మరొకరితో..**

## నిత్య పెళ్లికూతురు అరెస్ట్



**పెద్దవడుగూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లాడుతూ పలువురిని మోసం చేసిన యువతిని అనంతపురం జిల్లా పెదవడుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాలు వజ్రపు మణి అలియాస్ శ్వేతారెడ్డి అలియాస్ కీర్తి (27)ని మదనపల్లె మండలం చీలకబైలు వద్ద అరెస్ట్ చేసినట్లు పెద్దవడుగూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా దొండపూడికి చెందిన నిందితురాలు ఒకరికి తెలియకుండా మరొకరితో.. ఇలా ఐదు పెళ్లిళ్లు చేసుకుంది. విజయవాడకు చెందిన మధ్యవర్తులు సుమప్రియ, అశోక్, శశికళ, రామకృష్ణతో చేతులు కలిపి ఎదురుకట్నం వచ్చేలా పెళ్లి సంబంధాలు కుదుర్చుకునేది. ఒకరితో పెళ్లి తర్వాత వారి వద్ద కొన్ని రోజులు ఉండి స్వస్థలానికి వెళ్లిపోయేది. ఈ క్రమంలో పెద్దవడుగూరు మండలం కాసేపల్లికి చెందిన యాపర్ల సుధీర్‌రెడ్డిని 2025లో వివాహం చేసుకున్న నిత్యపెళ్లికూతురు.. కొద్దిరోజులకే అతడికి చెప్పకుండా మాయమైంది. ఈ ఘటనపై సుధీర్ ఫిర్యాదుతో పెద్దవడుగూరు పీఎస్‌లో కేసు నమోదైంది. ఇటీవల కర్ణాటకలోని మల్లెకుప్పానికి చెందిన ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుని ఆరు రోజుల తర్వాత మదనపల్లె వెళ్తుండగా.. చీకలబైలు వద్ద పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు.

## కర్నూలులో పీసీబీ అధికారి నివాసంలో ఏసీబీ సోదాలు

**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని చాణక్యపురి కాలనీలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) జోనల్ అధికారి యుగంధర్ మునిప్రసాద్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. తిరుపతిలోని పీసీబీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలతో ఏసీబీ తనిఖీలు చేసింది. కర్నూలుతో పాటు తిరుపతి, హైదరాబాద్‌లో ఏకకాలంలో సోదాలు జరుగుతున్నాయి. ఈ దాడులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.5.87 లక్షల నగదు, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్‌బీఐ లాకర్, రెండు ఇళ్లు, భార్య పేరున 4 ఓపెన్ ప్లాట్లు, 17 తులాల బంగారం, 3 కిలోల వెండి ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆస్తుల విలువ రూ.4 కోట్లు ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. బహిరంగ మార్కెట్‌లో ఈ విలువ మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.




## విదేశీ వర్సిటీల్లో.. ఉచితంగా నేర్చుకుందాం..



విదేశాలకు వెళ్లి చదవాలనీ, నాణ్యమైన విద్యా బోధనను అందుకోవాలనీ చాలామంది విద్యార్థులు అనుకుంటారు. కానీ రకరకాలైన కారణాల వల్ల వెళ్లలేకపోతుంటారు. ఫీజు ఎక్కువనే భయం ఉండనే ఉంది. కానీ అక్కడికి వెళ్లకుండానే ఆ యూనివర్సిటీల్లో చదివే అవకాశం ఉందని చాలా మందికి తెలియదు. ఆన్‌లైన్ ద్వారా ఈ సంస్థల్లో వివిధ కోర్సులు చేయవచ్చు. ఆ వివరాలేంటో చూద్దామా! ప్రఖ్యాతిగాంచిన విదేశీ యూనివర్సిటీలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరి కోసం కొన్ని ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఇవి వారి విద్యాసంస్థల్లో ప్రమాణాల స్థాయిని పరిచయం చేయడమే కాకుండా... విద్యార్థులు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేందుకు పనికొస్తాయి. ఇటువంటి కోర్సుల్లో చేరిన విద్యార్థులు తమకు నచ్చిన విభాగాల్లో ప్రాథమికాంశాలు ఉచితంగా నేర్చుకోవచ్చు. అంతేకాదు, విదేశీ విశ్వవిద్యాలయం నుంచి చదివామన్న తృప్తీ లభిస్తుంది, జాబ్ మార్కెట్‌లో మంచి అవకాశాలూ అందుకోవచ్చు. ఇవి అధికశాతం ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అనుసంధానమై పనిచేస్తున్నాయి. అంటే సంబంధిత వర్సిటీ అధ్యాపకులే ఈ ప్లాట్‌ఫామ్స్ ద్వారా బోధిస్తారన్నమాట.

### హార్వర్డ్ యూనివర్సిటీ

ఐవీ లీగ్‌లో ముఖ్యమైన, పురాతనమైన వర్సిటీ ఇది. దాదాపు 600లకు పైగా కోర్సులను విద్యార్థులకు ఉచితంగా అందిస్తోంది. ఉన్నత స్థాయి ప్రమాణాలతో, తమ విద్యాబోధన ఎలా ఉంటుందనే విషయం తెలిసేలా ఈ కోర్సులు ఉంటాయి. ఇవి ఒకటి నుంచి పన్నెండు వారాల వ్యవధితో లభిస్తాయి. సాహిత్యం, లా, బిగ్‌డేటా, సామాజిక అంశాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, ప్రోగ్రామింగ్, గేమ్ డెవలప్‌మెంట్, చరిత్ర, న్యూరోసైన్స్.. ఇలా విభిన్న అంశాలను నేర్చుకునే వీలుంది. ఇవేకాక ఆధునిక సాంకేతిక కోర్సులైన మెషిన్ లెర్నింగ్, పైతాన్ లాంగ్వేజ్, గేమ్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్ వంటి వాటిలోనూ ప్రాథమిక అంశాలు నేర్చుకోవచ్చు.

### జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్ - మూక్స్ ద్వారా ఈ విద్యాసంస్థ ఆన్‌లైన్ కోర్సులను అందిస్తోంది. అప్పటి నుంచి ముప్ఫై లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. అంతేకాదు.. ఇవన్నీ వివిధ ర్యాంకింగ్ సిస్టమ్స్‌లో పోటీ పడి టాప్ ర్యాంకులు పొందిన కోర్సులు. ఈ కాలేజ్ అందించే మొత్తం 30 కోర్సుల్లో బిజినెస్, కంప్యూటింగ్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్, సప్లైచెయిన్ అండ్ లాజిస్టిక్స్ అనే విభాగాలు ఉన్నాయి. వీటిలో డేటా అనలిటిక్స్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, యూఎక్స్ డిజైన్, డేటా అనాలిసిస్, హెల్త్ ఇన్ఫర్మేటిక్స్, పైతాన్, జావా, డేటా స్ట్రక్చర్స్ అండ్ అల్గారిదమ్స్, మెకానిక్స్, మెటీరియల్స్, ఎలక్ట్రానిక్స్, మెషిన్ డిజైన్, అనలిటిక్స్ మోడలింగ్, స్టాటిస్టిక్స్, ఇన్నోవేషన్ లీడర్‌షిప్, సప్లై చెయిన్ ప్రిన్సిపల్స్... వంటి అనేక అంశాలు చదివే వీలుంది. ఎడ్‌ఎక్స్, కోర్సెరా, ఉడాసిటీ వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా వీటికి ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

### మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)

ఇందులో కోర్సులు గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయుల్లో ఉన్నాయి. ఇంజినీరింగ్, అర్బన్ స్టడీస్, మేనేజ్‌మెంట్, మ్యాథమెటిక్స్, లిటరేచర్, ఆర్కిటెక్చర్, జాగ్రఫీ, కాగ్నిటివ్ సైన్స్, హిస్టరీ, ఏరోనాటిక్స్, ఫిజిక్స్, ఎకనమిక్స్, లింగ్విస్టిక్స్ - ఫిలాసఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆంత్రొపాలజీ, మీడియా స్టడీస్, బయాలజీ, న్యూక్లియర్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజికల్ ఎడ్యుకేషన్.. ఇలా దాదాపు అన్నిరకాలైన సబ్జెక్టులపై సుమారు 3 వేల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని చదివేవి, ఇంటరాక్టివ్ పద్ధతిలో లభించేవి విడివిడిగా దొరుకుతున్నాయి. సైంటిఫిక్ థియరీలను నేర్చుకునే క్రమంలో దీన్ని మించిన వర్సిటీ మరొకటి లేదనే ప్రఖ్యాతి ఉంది.

### యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా

ఎడ్‌ఎక్స్ సంస్థతో అనుసంధానమై కోర్సులు అందిస్తోందీ వర్సిటీ. 2012 నుంచి దాదాపు 150 దేశాలకు చెందిన 40 లక్షల మందికిపైగా విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరారు. ప్రొఫెషనల్ సర్టిఫికెట్స్ కూడా ఇస్తుంది. బిజినెస్ రైటింగ్, ఎలక్ట్రానిక్స్ ఎమోషనల్ ఇంటెలిజెన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఇంగ్లిష్ లిటరేచర్, జర్నలిజం, సోషల్ జస్టిస్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, క్రిప్టో కరెన్సీస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్.. ఇలా లభిస్తున్నాయి. గంటల నుంచి వారాల వ్యవధిగల ఈ కోర్సుల్లో ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కావాలంటే కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

### మిషిగాన్ స్టేట్ యూనివర్సిటీ

ఫొటోగ్రఫీ, మ్యూజిక్, గేమ్ డెవలప్‌మెంట్, స్క్రిప్ట్ రైటింగ్, మైండ్‌వేర్, జర్నలిజం, రైటింగ్, పిక్సల్ ఆర్ట్, క్రియేటివిటీ, బిజినెస్ వంటి కోర్సులు చేయవచ్చు. గమనిస్తే... ఈ వర్సిటీ అందించేవన్నీ సంప్రదాయ చదువులకు భిన్నంగా ఉండే మార్గాలే! వీటి గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థులకు సులభంగా సమాచారం దొరికేలా ఈ ప్రోగ్రామ్స్‌ను అందుబాటులో ఉంచారు. ఇవి పూర్తి చేసిన తర్వాత కంప్లీషన్ సర్టిఫికెట్ లభిస్తుంది. వారానికి ఎన్నిగంటలు కావాలో అలా చదువుకునే వీలుంటుంది. దాదాపుగా 6 నెలల్లో పూర్తిచేయవచ్చు.

### కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది ఆర్ట్స్

ఈ ఆర్ట్స్ కాలేజీ నుంచి విద్యార్థులు స్పెషలైజ్డ్ ప్రోగ్రామ్స్ చేసే వీలుంది. క్రెడిట్స్, సర్టిఫికెట్స్ కావాలంటే ఫీజు చెల్లించాలి. ఫ్రీలాన్సింగ్ బిజినెస్, గేమ్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, మ్యూజిక్ థియరీ - టెక్నాలజీ, పొయిట్రీ, యూఐ/యూఎక్స్ డిజైన్, వెబ్ డిజైన్ వంటి ప్రోగామ్స్‌ను కోర్సెరా ప్లాట్‌ఫామ్ నుంచి చేయవచ్చు.

### యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్

యూకేలో ఉన్న టాప్ కాలేజీల్లో ఇదీ ఒకటి. ఇటీవల విడుదల చేసిన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉంది. ఇందులో ఆంత్రొపాలజీ, సిటిజన్ సైన్స్, కల్చర్, హెల్త్... ఇలా 170కి పైగా ప్రోగామ్స్ ఆన్‌లైన్‌లో చదవొచ్చు. దాదాపుగా ఉచితంగా లభిస్తాయి. కొన్ని ప్రత్యేక ప్రోగామ్స్‌కి మాత్రం ఫీజు చెల్లించాలి.




## పేదవాడి ఇళ్లు అంటే ఇంత చులకనా..?


**మురికివాడలను తలపిస్తున్న టీడ్కో అపార్ట్‌మెంట్స్ వాతావరణం**

**గోల్లపుంత క్వాలనీ ప్రజలకు దుర్వాసనతో దినచర్య కష్టసాధ్యం**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రభుత్వాలు ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆపరేషన్ క్లీన్ స్విప్, స్వచ్ఛ సురక్ష అనే పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతుంది. కానీ మండపేట మున్సిపాలిటీ అయితే ఏ కార్యక్రమానైనా క్లిచిక్ అంటూ ఫోటోకి పరిమితం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో స్థానిక గోల్లపుంత వైయస్సార్ క్వాలనీ,టిడ్కో ఆవరణలో మైనర్ మేజర్ కాలువల నుంచి వచ్చే వ్యర్థాలను తొలగించిన చెత్తను రోజులు గడిచిన అక్కడనుంచి తొలగించకపోవడంతో చిన్న సైజు కొండ మాదిరి అపరిశుభ్రతతో క్రిమి కీటకాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. క్వాలని ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో చెత్త పేరుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంట్లోంచి బయటికి వస్తుంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని క్వాలనీవాసులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. వర్షాలు వస్తుంటే ఈ చెత్త రోడ్డుపై పాకి మరి అధ్వానంగా తయారవుతుందని అంటున్నారు. ప్రస్తుతం విష జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకి మెల్లగా పెరుగుతుందని ఒకపక్క రోగాలు మరోపక్క దండయాత్ర చేస్తున్న ఈగలు,దోమలు విజృంభణతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అధికారులు సైతం రాకపోకలు ఈ మార్గం గూండానే సాగించినప్పటికీ ఈ పెంట కుప్పలు వాళ్లకు కనబడకపోవడం ఆశ్చర్యంగా ఉందని అక్కడివారు అంటున్నారు. బ్యాంక్ కాలనీ,విజయలక్ష్మి నగర్, కృష్ణ కళ్యాణి నగర్ వంటి ధనిక క్వాలనిలలో నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాలలో వేగం పేదవారి కాలనీలో ఎందుకు కనబడటం లేదని ఇక్కడ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వం అందరికీ సమానమని

ఈ విధమైన వ్యత్యాసాలు చూపించకుండా తమకు మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ కాల పరిమితి పూర్తయినప్పటికీ కౌన్సిల్ స్థానంలో ప్రత్యేక అధికారిని నియమించినప్పటికీ పర్యవేక్షణ లోపం స్పష్టంగా తెలియవస్తుందని క్వాలనివాసులు బహిరంగంగానే ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇక్కడ ప్రజలు విస్తు పోవడానికి గల ముఖ్యమైన కారణం మున్సిపల్ ఇరిగేషన్ శాఖల సమన్వయ లోపమనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ప్రజల సమస్యలపై పరిష్కారాలు చూపుతున్నట్లు కనపడుతున్నప్పటికీ సమస్యలను మరింత జటిలం చేస్తున్నారని, ఇరు డిపార్టుమెంట్ల సమన్వయలోపం మాత్రం స్పష్టంగా కనపడుతుందని ఈ సమస్య పరిష్కారానికి స్థానిక శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు దీనిపై దృష్టి సారించి తమ సమస్యను పరిష్కరించవలసిందిగా కోరుతున్నారు.




ఈ కాలని ఏర్పడినప్పటి నుంచి లేనటువంటి సమస్యలు ఇప్పుడు స్పష్టంగా కనబడుతున్నాయని ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా మున్సిపల్ ఇరిగేషన్ అధికారులు వంతులు వేసుకుంటూ చోద్యం చూస్తున్నారని అవార్డుల కోసం మాత్రం రాష్ట్రస్థాయి అధికారులతో బేరాలు మాత్రం బాగా కుదుర్చుకుంటూ ర్యాంకులు సాధిస్తున్నారని తీవ్రంగా ఖండించారు.



**కోణాల సుభాష్ చంద్రబోస్, గొల్లపూంతా కాలనీ వాసి...**

## మీ సమస్య... మా బాధ్యత 'ప్రజావారధి'లో పలు వినతులు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మీ సమస్య... మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్ర మాన్ని స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి. ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు.నగర్ లో లలితా నగరం,సంజీవనగర్ వాసులకు గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు కానీ స్థలాలు చూపించలేదని. పెద్ద ఎత్తున మహిళలు అర్జీ ఇచ్చారు వితంతులు, ఒంటరి మహిళలు, అంగవైకల్యులు నుండి ఫించన్ నిమిత్తం తదితర సమస్యలపై పలు వినపత్రాలు వచ్చాయి. గృహ హింసపై నందరాడ నుండి ఒక అర్జీ వచ్చింది.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని ఏపీ ఆర్ చౌదరి అన్నారు. ప్రజాసేవే పరమావధిగా,ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో కురగంటి సతీశ్ , జనతా వారధి జిల్లా కన్వీనర్ శివరామ కృష్ణంరాజు, కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్,యనాపుఏసు.స్వామి సూర్యకిరణ్ , జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజర్షి సాహు మహారాజ్ జయంతి

**దేశంలో 1902లో రిజర్వేషన్ అమలు చేసిన తొలి యోధుడు**

**విద్యార్థులకు హాస్టల్ కాన్సెప్ట్ తీసుకొచ్చిన తొలి విద్యాబాంధవుడు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక చైతన్యానికి నిలువుటద్దం రాజర్షి సాహూ మహారాజ్ అని వక్తలు కొనియాడారు. పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు ఆధ్వర్యంలో శుక్రవారం సీతంపేట బీసీ సంక్షేమ బాలికల వసతి గృహంలో రాజర్షి సాహూ మహారాజ్ 152వ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసినివాళులర్పించారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ1874 జూన్ 26 భారతదేశ సామాజిక చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని, వెయ్యేళ్ళ అణచివేతకు వ్యతిరేకంగా, సమానత్వమే ఊపిరిగా పరిపాలన సాగించిన మహోన్నత వ్యక్తి, రాజర్షి ఛత్రపతి సాహూ మహారాజ్ అని కొనియాడారు.ఆనాటి సనాతన ధర్మం పేరుతో సాగిన బ్రాహ్మణ ఆధిపత్య పీడనాన్ని ప్రశ్నిస్తూ, బహుజన సమాజానికి ఆత్మగౌరవాన్ని అందించిన ఆ మహనీయుని జీవితం నేటికీ మనందరికీ ఒక గొప్ప స్ఫూర్తి అని పేర్కొన్నారు..సాహూ మహారాజ్ ఒక రాజుగా పుట్టి, ఒక సంస్కర్తగా జీవించి, చివరకు అణగారిన వర్గాల గుండెల్లో ఒక దేవుడిగా కొలువై ఉన్నారని, ఆయన ఆశయాలను నెరవేర్చడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళిఅని పేర్కొన్నారు. 152వ జయంతి జరుపుకుంటున్న ఈ తరుణంలో సాహూ మహారాజ్ కన్న కలలను సాకారం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.రాజర్షి ఛత్రపతి సాహూ మహారాజ్, బహుజన సమాజానికి ఎప్పటికీ నిలిచి ఉండే ధ్రువతార అని ,ఈ జయంతి వేళ ఆ మహనీయుని ఆశయాలను స్మరించుకుంటూ, కులరహత, సమసమాజ స్థాపనకు పునరంకితమవుదామని నయనాల కృష్ణారావు కోరారు.కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ రాణి శకుంతల,విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

**కిడ్నీ మార్పిడిలో కొత్త చరిత్ర..**

## 381 కుటుంబాల్లో వెలుగులు నింపిన యశోద

**రాజమహేంద్రవరంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించిన వైద్య బృందం - సరికొత్త సాంకేతికతతో వైద్యరంగంలో అరుదైన మైలురాయి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ హైటెక్ సిటీకి చెందిన యశోద ఆసుపత్రి వైద్యరంగంలో అపూర్వ ఘట్టాన్ని ఆవిష్కరించింది. మూత్రపిండాల వ్యాధులతో మృత్యువు అంచున నిలిచిన రోగులకు అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో ఊపిరిపోసింది. ఏకంగా 381 సంక్లిష్టమైన కిడ్నీ మార్పిడి ఆపరేషన్లను అత్యంత సమర్థవంతంగా పూర్తి చేసి ఎందరో బాధితులకు కొత్త జీవితాన్ని ప్రసాదించింది. సాధారణంగా అవయవ దాత, గ్రహీత మధ్య రక్త వర్గాలు కలవడం శస్త్రచికిత్సలో అత్యంత కీలకం. అయితే, ఇలాంటి సంప్రదాయ అడ్డంకులను అధిగమించి, భిన్న రక్త వర్గాలు ఉన్నప్పటికీ ఆధునిక సాంకేతికత సాయంతో ఆపరేషన్లను సఫలం చేయడం తమ బృందం సాధించిన అరుదైన ఘనత అని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక అవగాహన సదస్సులో వైద్య నిపుణులు వెల్లడించారు. వయసు మీద పడటం అనేది కిడ్నీ మార్పిడికి ఏమాత్రం




ప్రతిబంధకం కాదని యశోద వైద్యులు ప్రాక్టికల్ గా నిరూపించారు. అరవై ఏళ్లు దాటిన వృద్ధులకు సైతం అత్యంత సురక్షితమైన విధానంలో శస్త్రచికిత్సలు చేసి వారి జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచారు. మూత్రపిండాలు పాడైన వారికి డయాలసిస్ చేయడం అనేది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, మార్పిడి శస్త్రచికిత్సతోనే సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన సుదీర్ఘ జీవితం సాధ్యమవుతుందని నెఫ్రాలజిస్టులు రాజశేఖర చక్రవర్తి, పి.విజయ్ వర్మ స్పష్టం చేశారు. తాము సాధించిన ఈ 381 ఆపరేషన్ల సంఖ్య కేవలం ఒక గణాంకం మాత్రమే కాదని, మృత్యుభయంతో వణికిపోయిన వందలాది కుటుంబాల్లో తిరిగి వెలుగులు నింపిన ప్రాణదానాలకు సజీవ సాక్ష్యమని వారు ఉద్ఘాటించారు. భిన్న రక్త వర్గాల మధ్య జరిగే అవయవ మార్పిడి పూర్తి సురక్షితమేనన్న అధునాతన సాంకేతికతపై సామాన్య ప్రజానీకంలో ఇంకా తగినంత అవగాహన రావాల్సిన అవసరం ఉందని వైద్యులు అభిప్రాయపడ్డారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందంతో యశోద ఆసుపత్రి అత్యుత్తమ అవయవ మార్పిడి కేంద్రంగా సేవలందిస్తోందని ఈ సందర్భంగా వారు వివరించారు. ఈ కార్యక్రమంలో హైటెక్ సిటీ బ్రాంచ్ మార్కెటింగ్ ప్రతినిధులు ఎస్.వి.రామకృష్ణ, వి.సాయికిరణ్ పాల్గొన్నారు.

## జనసేన 'క్యాడర్ టూ లీడర్' కమిటీలో నాగేంద్రకు స్థానం




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు లక్ష్యంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన 'క్యాడర్ టూ లీడర్' కార్యక్రమంలో భాగంగా అమలాపురం పార్లమెంట్ కమిటీ సభ్యుల వివరాలను పార్టీ విడుదల చేసింది. పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీ అమలాపురం పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో జనసేన ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల వివరాలు, సేవలకు సంబంధించిన ఆధారాలను సేకరించి పార్టీ కార్యాలయానికి అందించనుంది. ఈ సమాచార సేకరణ కమిటీలో తూర్పుగోదావరి జిల్లా, మండపేట నియోజకవర్గం నుంచి రాయవరం మండలం, సోమేశ్వరం గ్రామానికి చెందిన శాకా నాగేంద్రకు చోటు దక్కింది. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు, ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తున్న రాష్ట్ర నీటి పారుదల సంస్థ చైర్మన్, మండపేట నియోజకవర్గ జనసేన ఇంచార్జీ వేగుళ్ళ లీలాకృష్ణకు నాగేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన నిజమైన కార్యకర్తల వివరాలను సేకరించి వారికి గుర్తింపు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

## విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

**– మాదకద్రవ్యాలకు బానిస కాకూడదు**

**– ఆదిత్యలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో బీబీఏ, ఎంబీఏ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి. రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) ఏ.వి. సుబ్బరాజు, మహిళా పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి. మంగాదేవి, సబ్ ఇన్‌స్పెక్టర్ అమీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏ.వి. సుబ్బరాజు మాట్లాడుతూ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాలకు బానిస కాకూడదని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణలో పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరించి, డ్రగ్స్ వ్యక్తి, కుటుంబం, సమాజానికి శాపంగా మారుతాయని హెచ్చరించారు. సీఐ కె.వి. మంగాదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్‌డీపీఎస్ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.పీ. గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్. నాగేశ్వరరావు, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. లక్ష్మి సరోజ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో పలు నినాదాలతో తిలక్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## రాజ్యాంగం ప్రకారం దక్కాల్సిన హక్కుల కొరకు పోరాటం

**మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకట రావు హెచ్చరిక**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాలలను అణిచివేసే కుట్రలను తిప్పికొడతామనీ మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకట రావు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని క్వారీ మార్కెట్ సెంటర్‌లోని బి ఎన్ ఆర్ మినీ ఫంక్షన్ హాల్‌లో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యాన మాలల ఐక్యత చైతన్య యాత్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మల్లెల వెంకట రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల మంది మాలలను ఐక్యం చేసేందుకే హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ మాలల ఐక్యత చైతన్య యాత్ర ను ప్రారంభించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం మాలలను అణిచివేసే కుట్రలను సాగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మాలలు రాజ్యాంగం ప్రకారం దక్కాల్సిన హక్కులను మాత్రమే కోరుకుంటున్నారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అడ్డుగా పెట్టుకుని నేటి కూటమి ప్రభుత్వం ఏబిసిడి వర్గీకరణ ద్వారా



మాలలపై అణచివేతకు పాల్పడుతుందన్నారు. ఉన్న జనాభా ప్రకారం వర్గీకరణ చేస్తే 12 శాతం రిజర్వేషన్ రావాల్సి వుందన్నారు. కానీ ప్రభుత్వం మాలలను తక్కువ చేసి మాదిగలకు మేలు చేసేలా వర్గీకరణ చేసిందని ఆరోపించారు. మాలలకు తీరని అన్యాయం జరుగుతున్న మాల జాతికి చెందిన ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదన్నారు. దళిత క్రైస్తవులుగా ఎస్సీ హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సర్ ద్వారా మాలలకు ఓటు హక్కును లేకుండా కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. మాలలు సర్ పట్ల అప్రమంతంగా ఉండాలని, ప్రతి ఒక్క మాల జాతి ఓటును కాపాడుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపు ఇచ్చారు. మాలల పై జరుగుతున్న అణిచివేతను తిప్పికొంటేందుకు ఆగస్టు నెలలో విజయవాడ కేంద్రంగా మాలల దండయాత్రతో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గొల్ల అరుణ్ కుమార్, మాలల సంక్షేమ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోట్ల గంగాధర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్ పాల్, మాల మహా సభ కోస్తాంధ్ర జిల్లాల కన్వీనర్ మాదే రామచంద్రరావు, డాక్టర్ సుబ్బారాయుడు, స్వర్ణాంధ్ర నిర్వాహకులు గుబ్బల రాంబాబు, స్థానిక నాయకులు ఆరే రాము, విజ్జిన మధు, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి రాజేంద్ర ప్రసాద్, రేబాక అబ్బులు, కొల్లి వినయ్, కిరణ్, అనిల్, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.




# భయపడొద్దు.. మీకు అండగా నేనున్నా..

**• అగ్నిప్రమాద బాధితులకు మంత్రి సుభాష్ ఆపన్నహస్తం • సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సాయం**
**• మంత్రి ఒక్క పిలుపుతో రూ.60 లక్షల సహాయానికి దాతల హామీ**

**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన ప్రజాసేవ అనే నమ్మకాన్ని మరోసారి కార్యరూపంలో చూపించారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. ద్రాక్షారామం మార్కెట్ లో గత రాత్రి సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 48 దుకాణాలు పూర్తిగా దగ్ధమై జీవనాధారాన్ని కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. బాధితుల ఆవేదనను ప్రత్యక్షంగా విన్న మంత్రి "కష్టంలో ఉన్న కుటుంబాలను ఒంటరిగా వదిలిపెట్టం... బాధితుల కన్నీళ్లు తుడవడం మనందరి బాధ్యత" అని భరోసా ఇచ్చారు. మాటలతోనే కాకుండా చేతలతోనూ అండగా నిలుస్తూ తన తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యం ద్వారా రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. అంతటితో ఆగకుండా ఇతర దాతలు, సేవాభావం కలిగిన ప్రముఖులతో స్వయంగా మాట్లాడి కేవలం గంట వ్యవధిలోనే మొత్తం రూ.60 లక్షల ఆర్థిక సహాయానికి హామీలు వచ్చేలా చొరవ చూపారు. బాధిత కుటుంబాలు తిరిగి తమ జీవితాలను నిలబెట్టుకునేందుకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ "ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడు వారి ఆనందంలో భాగం కావడం ఒక బాధ్యత అయితే... ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం అంతకంటే గొప్ప బాధ్యత మనిషికి మనిషే తోడు అనే భావనతో ప్రతి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం. ప్రభుత్వం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, దాతల సహకారంతో ఎవ్వరూ నిరాశలో ఉండకుండా చూస్తాం" అని అన్నారు.



**మార్కెట్‌ను పరిశీలించిన మంత్రి సుభాష్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ**

అగ్ని ప్రమాదంలో కాలిపోయిన షాపులను మంత్రి సుభాష్ తో పాటు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వై ఖోం నైదియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా , ఆర్డీవో సరళావతి లు పరిశీలించారు. సుమారు మూడు కోట్ల మేర ఆశ నష్టం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా బాధితులు అందరికీ ప్రభుత్వం తరపున సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ అగ్ని ప్రమాదం చాలా దురదృష్టకరమని విచారం వ్యక్తం చేస్తూ పోలీస్ శాఖ ద్వారా 50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం జరిగిందని చెబుతున్నప్పటికీ ఈ ప్రమాదం ఎలా జరిగింది అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బిజెపి ఇన్చార్జి దూడల శంకర్ నారాయణ, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యంలకు బాధితుల కృతజ్ఞతలు**

తమ కష్టాన్ని చూసి మానవత్వంతో చలించి ఆర్థిక సహాయానికి ముందుకు వచ్చిన మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం, దాతలు అందరికీ మార్కెట్ వర్తక సంఘం నాయకులు సుబ్బరాజు ఆధ్వర్యంలో హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో వెంటనే స్పందించి భారీ ఆర్థిక సహాయం ప్రకటించడం వల్ల బాధిత కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయని వారు పేర్కొన్నారు. సహాయాన్ని జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని కన్నీటి పర్యంతమయ్యారు.

కూటమి విజయోత్సవంలో

## ఎమ్మెల్యే బర్త్‌డే వేడుకలు

**కూటమి నేతలు, అభిమానులతో సందడిగా మారిన యానాం కోకో బీచ్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఎస్.యానాం కోకో బీచ్ (ఆంధ్రా గోవా) నందు అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో పండితుల వేద ఆశీర్వచనాల నడుమ ఎమ్మెల్యే ఆనందరావు భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనకు భారీ పూలమాలతో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఎమ్మెల్యే సూచన మేరకు పూల బొకేలు, దండలకు బదులుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం పుస్తకాలు, పెన్నులను అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం విజయోత్సవ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో టిడిపి నాయకుడు మోకా లోవరాజు మృతి



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోనకు చెందిన టిడిపి నాయకుడు మోకాలో వరాజు గురువారం రాత్రిరోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గెద్దనపల్లి వద్ద ఆర్ అండ్ బి రహదారిపై రాత్రి 11:30 ప్రాంతంలో రోడ్డుపై పడి ఉన్నాడని, తలకు బలమైన గాయం అయిందని, సంఘటన స్థలంలోనే మృతి చెందాడని అయితే మోటార్ బైక్ నుండి అదుపుతప్పి పడిపోయాడా? లేక ఏదైనా ఆబోతు అడ్డు రావడం వల్ల పడిపోయాడా) అన్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేక పోతున్నారు. మృతదేహాన్ని ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాట్రేనికోన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అయితే ఆవులు రోడ్డుపై సంచరించడంతో లావరాజు మోటార్ బైక్ నుండి కింద పడిపోయాడని, తలకు బలమైన గాయం అయిందని, పోలీసులు నిర్ధారించారు. లోవరాజు టిడిపిలో చురుగ్గా వ్యవహరించడంతోపాటు, కాట్రేను కోన గేట్ సెంటర్లో బిర్యానీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. ముందవరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్ తదితరులు సానుభూతి వ్యక్తం చేశారు.

**ప్రాణాలు తీస్తున్న ఆవులు**

కాట్రేనికోన మండలంలోని ప్రధాన రహదారి పక్కనున్న పలు పంచాయతీల పరిధిలో ఆవులు, ఆబోతులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.ఇవి రోడ్డుపై ప్రయాణం చేసే ప్రయాణికుల పాలిట మృత్యువులుగా మారాయి. వీటి బారిన పడి గాయపడ్డ సంఘటనలుగతంలో అనేకం ఉన్నాయి.తాజాగా గురువారం రాత్రి గెద్దనపల్లిలో ఆర్ అండ్ బి రహదారిపై ఆవులు అడ్డు రావడంతో టిడిపి పార్టీ నాయకుడు మోకా లోవరాజు ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. గతంలో మండల కేంద్రమైన కాట్రేనికోన గేట్ సెంటర్లో మేక అడ్డు రావడంతో ఒక విఆర్ఓ ప్రాణాలు కోల్పోయాడు. ఆబోతులు తరచూ రోడ్లపై యుద్ధానికి దిగుతున్నాయి. ఈ క్రమంలో వాహనాలు ధ్వంసం అవుతున్నాయి. ప్రజలు గాయపడుతున్నారు. పశువుల యజమానులు పశువుల నుండి పాలు తీసుకుని అనంతరం వాటిని రోడ్డుపైకి తోలేస్తున్నారు. పాలు యజమానులకు, తన్నులు ప్రజలకు అన్నట్లు జరుగుతున్న సంఘటనలు రూడీ చేస్తున్నాయి. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు సంబంధిత పశువుల యజమానులపై కేసులు నమోదు చేయాలని బాధితులు, స్థానికులు కోరుతున్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు బహుమతులు ప్రదానం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** 10వ తరగతిలో అత్యంత ప్రతిభ కనపరచిన ఎస్సీ విద్యార్థులకు అభినందన కార్యక్రమం అంబేద్కర్ భవన్ అమలాపురంలో ఘనంగా జరిగింది. ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సంఘ జిల్లా అధ్యక్షులు గోసంగి బంగార్రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. గౌరవ అధ్యక్షులు ఎం.ఎ.కె భీమారావు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు క్రమశిక్షణ నిర్విరామ కృషితో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఐఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వెల్ఫేర్ చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. పంచాయితీ రాజ్ డి.ఇ. పి.ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వెల్ఫేర్ చేస్తున్న కార్యక్రమాలు సమ సమాజానికి దిక్సూచిగా ఉంటాయని, వారు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని సంఘానికి అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్ బాబు, జివి రమణ, కళ్యాణ్ బాబు, ఎస్.ఎన్.మునీశ్వర రావు, దీపాటి సురేష్ బాబు, ఆర్థికకార్యదర్శి భూపతి మనోహర్రాజు, విద్యార్థిని విద్యార్థులకు మెమెంటో, మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ అందించిన విజయానంద సేవా సంస్థ బత్తుల ఆనందరావు, నేరేడుమిల్లి సత్యనారాయణ, సత్యనారాయణ, నందిక వెంకటేశ్వరరావు, కుంచే వెంకటేశ్వరరావు, గెద్దం ప్రదీప్, భయ్యా మోహనరావు, ఈద వివేకానంద, కోరుకొండ శ్రీకాంత్ శర్మ, ఆర్.ఆర్.కె. ప్రసాద్, పశ్చిమాల మోహన్, కోట సత్యనారాయణ, మానేపల్లి రవి, బీర రవికుమార్, బి.ఎస్.ఆర్.ప్రసాద్, వడ్డి శ్రీనివాసరావు, ఎం. బాలార్జున వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బి.ఎల్.ఏ యాప్, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై అవగాహన సదస్సు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బాధ్యులు పిల్లి సూర్య ప్రకాష్ పర్యవేక్షణలో బి.ఎల్.ఏ యాప్ వినియోగం మరియు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై అవగాహన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ పరిశీలకులు కర్రి నాగిరెడ్డి హాజరై బూత్ స్థాయి ప్రతినిధులకు మార్గనిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా బూత్ స్థాయి ప్రతినిధులకు యాప్ స్థాపన, ప్రవేశ ప్రక్రియ, సంకేతపదం మార్పు మరియు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను యాప్ ద్వారా ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో అనే అంశాలపై పూర్తిస్థాయిలో వివరించారు. బూత్ స్థాయి ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేస్తూ, ప్రతి బూత్ పరిధిలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు పార్టీ నాయకులు కలిసి పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద మంత్రాల మధ్య

## ఆది దంపతుల దివ్య కళ్యాణం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో మడికి గ్రామంలో హరి హర మహా క్షేత్రంలో కొలువైయున్న శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి సమేత శ్రీ సోమేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా వేదమంత్రాల మధ్య నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చక స్వాములు కాళ్ళకూరి కామేశ్వర శివాచార్య, అయిలూరి బ్రహ్మన్నల మంత్రోచ్ఛారణల మధ్య జరిగింది. ఈ కళ్యాణం వేద పండితులు నిర్వహించిగా ఈ కళ్యాణం తిలకించడానికి చెముడులంక, గాంధీనగరం, చిలకలపాడు, బడుగువానిలంక, చొప్పెల్ల, పొట్టిలంక గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శివ పార్వతుల కళ్యాణం సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పట్టు వస్త్రాలను ఆలయ ఈవో ఆదిదంపతులకు సమర్పించారు. ఆదిదంపతుల కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ఆర్ కృష్ణ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన

## ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఎంపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను ఎంపీ హరీష్ బాలయోగి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని 52 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.27,44,396 (ఇరవై ఏడు లక్షల నలభై నాలుగు వేల మూడు వందల తొంభై ఆరు) విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య చికిత్సల భారాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఖరీదైన వైద్య చికిత్సల కోసం చేసిన ఖర్చులను రీయింబర్స్‌మెంట్ రూపంలో ప్రభుత్వం అందించడం వల్ల అనేక మంది బాధిత కుటుంబాలకు ఉపశమనం కలుగుతోందని పేర్కొన్నారు. వైద్య అవసరాల సమయంలో పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సహాయానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ బాలయోగి కూడా ముఖ్యమంత్రి పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తం చిందిస్తూ.. త్యాగాలను స్మరిస్తూ..

## నిండుశోకంతో మొహర్రం

**గుమ్మటాలు, పీర్లు ఊరేగింపు**



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారం అమరత్వం పొందిన రోజు (షహదత్) సందర్భంగా మొహర్రంను శుక్రవారం ముస్లింలు నిండు శోకంతో నిర్వహించారు. ఈ సందర్భంగా 'హుస్సేన్... హుస్సేన్ అని నినదిస్తూ గుండెలు బాదుకుని మాతం నిర్వహించారు. చెయ్యేరు గ్రామంలోని రెండు పంజాల నుంచి పీర్లు, గుమ్మటాలను తీసి వీధుల్లో ఊరేగించారు. ఇరాక్లో లోని పవిత్ర కర్బలా పుణ్యభూమిలో జరిగిన యుద్ధ సంఘటనలను మత ప్రబోధకులు మౌలానా హైదర్ అలీ సాహెబ్ భక్తులకు వివరించారు. ఆయన ఆధ్వర్యంలో హజరత్ అబ్బాస్, ఇమామ్ హుస్సేన్ పంజాలలో అమరవీరుల పేరిట ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. స్థానిక హజరత్ హజ్రత్ అబ్బాస్ పంజా నుంచి ప్రారంభమైన ఊరేగింపు హుసైని పంజా మీదుగా మస్జిదే అబూ తాలిబ్ వరకు జరిగింది. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారం ప్రాణ త్యాగా లను స్మరిస్తూ ముస్లింలు తీవ్రంగా విలపించారు. మస్జిద్ వద్ద పీర్లను శాంతింప చేశారు. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ముస్లింలు నలుపు దుస్తులు ధరించి మొహర్రం సంతాప కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ ముస్లిం సంఘాల ప్రతినిధులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ద్రాక్షారామ కూరగాయల మార్కెట్

## అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

**ఏఐకేఎంఎస్, ఐఎఫ్టీయూ డిమాండ్**



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామ కూరగాయల మార్కెట్‌లో గురువారం అర్ధరాత్రి జరిగిన భారీ అగ్నిప్రమాదంపై అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి బి. సిద్ధు, అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యోగస్తుల జేఏసీ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వర్లు, ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు చింతా రాజారెడ్డి తదితరులు శుక్రవారం ఉదయం సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్రాక్షారామ కూరగాయల మార్కెట్ రామచంద్రపురం నియోజకవర్గంలోనే అత్యంత కీలకమైనదని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, చిరు వ్యాపారులు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ వ్యాపారం చేసుకునే వారంతా పేద, మధ్యతరగతి వర్గానికి చెందిన వారని ఈ అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరగడం తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మానవతా దృక్పథంతో కూటమి ప్రభుత్వం మరియు అధికారులు వెంటనే రంగంలోకి దిగి నష్టాన్ని అంచనా వేయాలని బాధితులకు తగిన నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అగ్నికి ఆహుతైన దుకాణాల స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త షాపులను నిర్మించి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రభుత్వం వారిని అన్ని విధాలా ఆదుకోవాలని ఏఐకేఎంఎస్, ఐఎఫ్టీయూ నాయకులు కోరారు.

# ధ్వజస్తంభంపై కలశం, సుదర్శన చక్రాల పునఃప్రతిష్ఠ



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో అనివేటి మండపంలో స్వర్ణ ధ్వజస్తంభంపై కలశం, సుదర్శన చక్రాలను శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ఠించారు. ఇటీవల వాన బీభత్సం, ఈదురుగాలులకు స్తంభంపై కలశం, సుదర్శన చక్రం స్వల్పంగా ఒరిగాయి. తొలుత వైదిక బృందం ఆధ్వర్యంలో వీటిని తొలగించి మరమ్మతులు చేశారు. అనంతరం సంప్రోక్షణ జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల నడుమ వీటిని ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చారు. వైదిక బృందం ఆధ్వర్యంలో కలశాన్ని, సుదర్శన చక్రంపైకి చేర్చి, ఆలయ ఛైర్మన్ రోహిత్, ఈవో చక్రధరరావు, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో యథాస్థానంలో పునఃప్రతిష్ఠించారు.

# కాపులు పవన్‌ను వదిలి ఎక్కడికీ పోరు

**పవన్ పర్యటించినప్పుడే వైసీపీ నేతలకు మెలకువ వస్తుంది**

**జనసేన నేత చిక్కాల దొరబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఉభయగోదావరి జిల్లాలో పర్యటించినప్పుడే వైసీపీ నేతలకు మెలకువ వస్తుందని, అప్పటి వరకు నిద్రపోతుంటారని జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు విమర్శించారు. గత రెండున్నర సంవత్సరాలలో చంద్రబాబు, మోడీ, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. గతంలో లా కాకుండా గంజాయి, మత్తుపదార్థాల రవాణాకు అడ్డుకట్ట పడిందని గుర్తు చేశారు. ప్రజలంతా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను సీఎం గానే చూసుకుంటున్నారని అన్నారు. గత ఎన్నికల్లో జగన్ ఎమ్మెల్యే స్థానాలు మార్చినప్పటికీ ప్రజలు ఆశీర్వదించలేదని వారిని చిత్తుగా ఓడించారని దొరబాబు చెప్పారు. కాపులు అన్ని పార్టీలోను ఉన్నారని, గతంలో చిరంజీవి వల్ల కొంతమందికి గుర్తింపు వస్తే,ఇప్పుడు పవన్ కళ్యాణ్ వల్ల కూడా గుర్తింపు వస్తోందని ఆయన పేర్కొన్నారు. కాపుల్లో చాలామంది మంచి ఉంటే ముందుకు వస్తారని, నచ్చకపోతే వదిలేస్తారని అయితే పవన్ కళ్యాణ్ ను వదిలి కాపులు ఎక్కడికి పోరని చిక్కాల దొరబాబు స్పష్టం చేశారు.

**ఎన్నికల సంఘం సూచించిన**

# గడువులోపు దరఖాస్తులు సమర్పించాలి : కుడుపూడి సత్తిబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు శుక్రవారం సాయంత్రం నగరంలోని 3వ వార్డు పరిధిలోని 127, 128, 129, 130, 131 పోలింగ్ బూత్‌ల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. సాయంత్రం ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేరు నమోదు, సవరణలు, చిరునామా మార్పులు, ఇతర వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జాబితాలో పేరు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తూ, ఎన్నికల సంఘం సూచించిన గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలతో సమన్వయం చేస్తూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఓటర్ల పాత్ర ఎంతో కీలకమని, అందువల్ల ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో అలసత్వం వద్దు

**అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారి టి.వి.రంగారావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘం పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పనులను వేగవంతం చేయాలని అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారి టి.వి. రంగారావు బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు. స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పక్రియలో పురోగతిపై సమీక్షించారు. ఓటరు జాబితా సవరణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమీక్ష సమావేశాలతో మున్సిపల్ కమిషనర్ అసిస్టెంట్ ఎన్నికల నమోదు అధికారి టి.వి. రంగారావు కాలక్షేప సమావేశాలే తప్ప సర్ ప్రక్రియలో పారదర్శకత లేదని, నియమించిన సహాయక సిబ్బందైన ఆర్పీ లు బాధ్యతతో వ్యవహరించకపోవడం పట్ల పలు విమర్శనాత్మక వాదనతో అధికార పార్టీ సోషల్ మీడియా ప్రతినిధి, బి ఎల్ ఏ గ్రంధి సత్తిరాజు ప్రత్యక్ష సాక్షిగా నిలబడటం పట్ల ప్రతిపక్ష పార్టీలు సర్ పై చేస్తున్న వాధనలలో పూర్తిస్తాయి వాస్తవాలు బహిర్గతం అయ్యాయి.

# దమ్ము చక్రాల తాకిడి రహదారులకు దెబ్బ..!

**కిసాన్ మోర్చా ఆందోళన - రైతులకు విజ్ఞప్తి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** సాగు పనులు ఊపందుకున్న నేపథ్యంలో పొలాల్లో దమ్ము చేసేందుకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్ల దమ్ము చక్రాలు గ్రామీణ రహదారుల పాలిట శాపంగా మారుతున్నాయని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పొలాల్లో పని ముగించుకున్న అనంతరం దమ్ము చక్రాలను తొలగించకుండానే ట్రాక్టర్లు రోడ్లపైకి రావడంతో తారు రహదారులు దెబ్బతిని గుంతలు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడే రోడ్లు ఇలా కొద్దికాలంలోనే ధ్వంసం కావడం బాధాకరమన్నారు. దమ్ము చక్రాల వల్ల ఏర్పడే గుంతలు వాహనదారులు, విద్యార్థులకు ప్రమాదకరంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయం మన జీవనాధారం అయినప్పటికీ ప్రజా సౌకర్యాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించకూడదని రైతులకు విజ్ఞప్తి చేశారు. పొలం వద్దే దమ్ము చక్రాలను తొలగించి, రోడ్లపైకి వచ్చేటప్పుడు సాధారణ టైర్లను వినియోగించాలని లేదా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని కోరారు. ముఖ్యంగా రోడ్లను ధ్వంసం చేస్తున్న ట్రాక్టర్లపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు సూచనలు ఇవ్వాలని కోరారు. రైతులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితేనే అభివృద్ధి పనులను కాపాడుకోవచ్చని చింతా తమ్మిరెడ్డి స్పష్టం చేశారు.

**ప్రజా సమస్య పరిష్కార వేదికలో**

# అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వేగుళ్ళ




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, రెవెన్యూ, ఇళ్ళ స్థలాలు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, సీఎం సహాయనిధి తదితర సమస్యలకు సంబంధించిన 31 వినతి పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే ప్రతీ సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని, ప్రతీ అర్జీపై పారదర్శకంగా చర్యలు తీసుకునేలా పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలు

**కూటమి రెండేళ్ల విజయోత్సవ విందుకు పోటెత్తిన జనసునామీ**

**భారీ సంఖ్యలో తరలివచ్చిన జనసైనికులు, తెలుగు తమ్ముళ్లు, బీజేపీ నాయకులు, అభిమానులు**

**ఆంధ్రా గోవా కోకో బీచ్‌లో అపూర్వ ఘట్టం.. - దాదాపు 18 వేల మందితో జనసంద్రంగా మారిన తీరం**





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలు, కూటమి రెండేళ్ల విజయోత్సవ విందు కార్యక్రమానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండేళు పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే అమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సూరసేన యానాంలోని ఆంధ్రా గోవాగా పేరొందిన కోకో బీచ్ వద్ద అత్యంత వైభవంగా కూటమి విజయోత్సవ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమలాపురం నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. దాదాపు 18 వేల మందికి పైగా తరలిరావడంతో కోకో బీచ్ తీరమంతా జనసంద్రంగా మారింది. సముద్రపు అలల సవ్వడి మధ్య "జై హో కూటమి", "జై ఆనందరావు" అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో కోకో బీచ్ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. టిడిపి, జనసేన, బీజేపీ శ్రేణులు ఒకే వేదికపై కలిసి గత రెండేళ్ల కూటమి పాలనలో సాధించిన విజయాలను గుర్తుచేసుకుంటూ విజయోత్సవ విందులో పాల్గొన్నారు. అనంతరం అభిమానులు, కార్యకర్తల సమక్షంలో అయితాబత్తుల ఆనందరావు జన్మదిన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు గజమాలలు, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న ఈ శుభసమయంలో తన జన్మదిన వేడుకలను పండుగలా నిర్వహించిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలే తనను మరింత బాధ్యతతో ప్రజాసేవ చేసేలా ప్రేరేపిస్తున్నాయని, అమలాపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మూడు పార్టీల నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో 'జనతా వారధి'కి విశేష స్పందన



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అమలాపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు, వినతులను పార్టీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా జనతా వారధి కన్వీనర్ చీకరమెల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల పవన్ కుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సంప్రదించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని సమస్యల పరిష్కారానికి తక్షణ స్పందన వచ్చేలా చర్యలు ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే వేదికగా 'జనతా వారధి' కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనతా వారధి కో-కన్వీనర్ దాట్ల వెంకట సుబ్బరాజు, అమలాపురం టౌన్ అధ్యక్షుడు అయ్యాల భాస్కరరావు, జిల్లా మాజీ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మన్నె రామదాస్, అమలాపురం టౌన్ మండల మాజీ అధ్యక్షుడు ఆరిగెల తేజ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ఆర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం మురమళ్ళలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పలు సమస్యలపై ఆర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ వివిధ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే తక్షణమే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మరికొన్ని సమస్యలను అక్కడే అధికారులతో పరిష్కరించారు. మరిన్ని సమస్యలను ఆన్లైన్ ద్వారా నమోదు చేయాలని కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నియోజకవర్గ ప్రజలతో పాటు,స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
శనివారం, 27 జూన్ 2026
www.viswamvoice.com



### కిడ్నీ ఆరోగ్యంపై ప్రజల్లో

# చైతన్యమే లక్ష్యంగా మెగా అవగాహన సదస్సు

**సాగర్ కిడ్నీ కేర్ 10వ వార్షికోత్సవం - కిడ్నీ మార్పిడి సులభం కాదు. - ముందు జాగ్రత్తలతో నూతన జీవితం సాధ్యం**
**రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖ నెఫ్రాలజిస్టులు, ట్రాన్స్‌ప్లాంట్ నిపుణుల పిలుపు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కిడ్నీ వ్యాధులపై ప్రజల్లో అవగాహనతో, అవయవదానంతో చైతన్యమే లక్ష్యంగా కిడ్నీ మార్పిడి ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలను ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా సాగర్ కిడ్నీ కేర్ హాస్పిటల్ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శశాంక పాకలపాటి ఆధ్వర్యంలో స్థానిక చెరుకూరి ఫంక్షన్ హాల్‌లో మెగా కిడ్నీ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి పేరొందిన నెఫ్రాలజిస్టులు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, యూరాలజిస్టులు, వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, డయాలసిస్ రోగులు, కిడ్నీ మార్పిడి పొందిన వారు, వారి కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సభా ప్రాంగణం వైద్య నిపుణులతో కిక్కిరిసిపోయింది. ప్రారంభంలో సాగర్ కిడ్నీ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ శశాంక పాకలపాటి మాట్లాడుతూ, కిడ్నీ వ్యాధి నిశ్శబ్దంగా శరీరాన్ని దెబ్బతీసే సమస్య అని, ప్రారంభ దశలో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలామంది నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తీవ్ర స్థాయికి చేరుకున్న తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నారని, అప్పటికి చికిత్స ఖర్చు, శారీరక ఇబ్బందులు, కుటుంబంపై ఆర్థిక భారం మరింత పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాలలో మొట్ట మొదటి సారిగా డయాలసిస్ మరియు గుండె వ్యాధి గ్రస్థులకు అల్ట్రా ప్యూర్ వాటర్ కొరకు ఫ్రెసినియస్ 5008 ను లాంచ్ చేయడం జరిగిందని డాక్టర్ శశాంక తెలిపారు. కిడ్నీ మార్పిడి అనేది కేవలం శస్త్రచికిత్స మాత్రమే కాదని, దానికి సంబంధించి చట్టబద్ధమైన అనుమతులు, దాత-గ్రహీత ఆరోగ్య పరీక్షలు, ప్రభుత్వ నిబంధనలు, ఎథిక్స్ కమిటీ అనుమతులు వంటి అనేక ప్రక్రియలు ఉంటాయని వివరించారు. అవయవాల అక్రమ రవాణా, దళారీ వ్యవస్థను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోందని, అందువల్ల ప్రజలు చట్టబద్ధమైన మార్గంలో మాత్రమే చికిత్స పొందాలని సూచించారు. పలువురు ప్రముఖ వైద్యులు మాట్లాడుతూ, దేశంలో మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, జీవనశైలిలో మార్పులు కారణంగా కిడ్నీ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రతి వ్యక్తి ఏడాదికి కనీసం ఒకసారి కిడ్నీ పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సమర్థవంతంగా చికిత్స అందించవచ్చని సూచించారు. కిడ్నీలు శరీరంలో రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు, శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించడం, రక్తపోటును నియంత్రించడం, ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన హార్మోన్లను విడుదల చేయడం, శరీరంలో నీరు-ఉప్పు సమతుల్యతను కాపాడటం వంటి అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తాయని వైద్యులు వివరించారు. కిడ్నీలు దెబ్బతింటే శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. చివరి దశ కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న వారికి డయాలసిస్ ఒక తాత్కాలిక ప్రత్యామ్నాయమైతే, విజయవంతమైన కిడ్నీ మార్పిడి శాశ్వత పరిష్కారానికి దగ్గరైన చికిత్సా విధానమని నిపుణులు తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం వైద్యుల సూచనలు పాటిస్తూ మందులు క్రమం తప్పకుండా తీసుకుంటే రోగులు సాధారణ జీవితాన్ని గడపడంతో పాటు ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు కూడా నిర్వర్తించగలరని వివరించారు. అవయవదానం గురించి ప్రజల్లో ఇంకా అనేక అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించడం అత్యవసరమని వక్తలు పేర్కొన్నారు. ఒక వ్యక్తి మరణానంతరం చేసే అవయవదానం ద్వారా పలువురికి కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చని, అవయవదానం మానవతకు చేసే అత్యున్నత సేవల్లో ఒకటని కొనియాడారు. ప్రతి కుటుంబం అవయవదానం గురించి ముందుగానే అవగాహన పెంచుకుని, అవసరమైతే దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగినంత నీరు తాగడం, ఉప్పు వినియోగాన్ని తగ్గించడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం, వైద్యుల సలహా లేకుండా నొప్పి నివారణ మందులను అధికంగా వాడకపోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మధుమేహం, రక్తపోటును అదుపులో ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వైద్య నిపుణులు సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, గత పదేళ్లుగా సాగర్ కిడ్నీ హాస్పిటల్ వేలాది మంది కిడ్నీ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తూ విశ్వసనీయ సంస్థగా ఎదిగిందన్నారు.ఏషియా ఛానెల్ ఎండీ పంతం కొండలరావు మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించడం, నాణ్యమైన చికిత్స అందించడం, ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత అందించడంలో సాగర కిడ్నీ హాస్పిటల్ డాక్టర్ శశాంక ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సదస్సులో కిడ్నీ ఆరోగ్య పరిరక్షణ, డయాలసిస్, ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో ఆధునిక సాంకేతికత, శస్త్రచికిత్స అనంతర జాగ్రత్తలు, అవయవదానం చట్టపరమైన అంశాలపై నిపుణులు సవివరంగా వివరించారు. పాల్గొన్న వారి సందేహాలకు సమాధానాలు ఇస్తూ అవగాహన కల్పించారు. కిడ్నీ వ్యాధుల నివారణ, ముందస్తు పరీక్షల అవసరం, అవయవదానం, కిడ్నీ మార్పిడి ప్రాధాన్యత వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ మెగా కిడ్నీ అవగాహన సదస్సు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

### శంభాల నగరంలో

# 36 విగ్రహప్రతిష్టను తిలకించండి : బత్తుల

**29వ తేదీన మహా కుంభాభిషేకం - అత్యంత భక్తి శ్రద్ధలతో సుమంగళీ పూజ**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం గాదరాడ “ఓం శివశక్తి పీఠం - శంభాల నగరం” నందు వైభవంగా 36 దివ్య ఆలయాల విగ్రహప్రతిష్ట మహోత్సవాలను యావన్మంది భక్తులు కనులారా తిలకించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరాం కృష్ణ అన్నారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా వేద పండితులు పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా వైదికంగా పలు విశేష హోమాలు వైభవంగా నిర్వహించారు.శుక్రవారం సర్వవిఘ్నాలు తొలగిపోవాలని గణపతి హోమం,శ్రీ రుద్ర, సదాశివమూర్తి హోమం, లోకకల్యాణార్థం సర్వజన సుఖినోభవం కాంక్షిస్తూ లయకారుడికి రుద్రహోమాలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం కోసం, సకల ఐశ్వర్య సిద్ధుల కొరకు రాజ శ్యామల యాగం, శక్తి స్వరూపిణి పూజలు చేపట్టారు.మహిళల సౌభాగ్యం వర్ధిల్లాలని, కుటుంబాలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వెలుగొందాలని “సుమంగళి పూజ” అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ గాదరాడ గ్రామంలో”“ఓం శివశక్తి పీఠం”లో 54 దేవతమూర్తుల ఆలయాలతో పాటు అష్టాదశ శక్తి పీఠాల తో ఆలయం వెలుగొందుతుందన్నారు. ఇప్పుడు 36 దివ్య ఆలయాల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు, 36 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవ విగ్రహాలు ప్రతిష్టించనున్నట్లు తెలిపారు. అనంతరం మహా పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 29వ తేదీన “మహా కుంభాభిషేకం”అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.సమయాభావం లేకపోవడంతో శంభాల నగరంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు అందర్నీ పిలవలేకపోయానని, అన్యథా భావించక నియోజకవర్గ ఎన్డీఏ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను కనులారా తిలకించి, స్వామి వారి దివ్యఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల కుటుంబసభ్యులు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### బూరుగుపూడి వద్ద 75వేల రూపాయల

# గంజాయి స్వాధీనం : ఎస్‌విఎస్ మూర్తి

**ఐదుగురు అరెస్ట్, రెండు బైకులు రెండు సెల్ ఫోన్లు కీప్యాడ్ స్వాధీనం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ బూరుగుపూడి గేటు వద్ద నిర్వహించిన తనిఖీలలో సుమారు 75వేల రూపాయల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్వివి సత్యనారాయణ మూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో బూరుగుపూడి గేటు వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఒరిస్సా రాష్ట్రం నుంచి రాజమహేంద్రవరం మీదుగా తరలిస్తున్న సుమారు 15కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని తెలంగాణకు చెందిన షేక్ నజీర్,షేక్ అస్వాక్, మహమ్మద్ అవేజ్ ఖాన్, తమ్మిశెట్టి దుర్గా ప్రసాద్,తమ్మిశెట్టి పెద్దిరాజులను అరెస్టు చేసిన, రవాణాకు ఉపయోగించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్,నంబర్ ప్లేట్ లేని హోండా డియో మోటార్‌సైకిల్, రెండు స్మార్ట్ ఫోన్లు, కీ-ప్యాడ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నా మన్నారు. యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షించుకోవాలన్నారు. ముద్దాయిలలో ఇద్దరు బీఫార్మసీ, ఇంజనీరింగ్ చదువుతున్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మొహర్రం సంతాప దినం - అమరుల త్యాగం ఇస్లాం ఊపిరి

**మండపేట హనఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్‌లో ప్రార్థనలు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మానవత్వం, న్యాయం, ధర్మం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయ మహా ప్రవక్త మహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లెం మనుమడు హజరత్ ఇమామ్ హుస్సేన్ నేటికీ ప్రపంచ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని మండపేట హనఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్ ఇమామ్ ముహమ్మద్ గులాం ముర్షీద్ రజ్వీ అన్నారు. 61వ హిజ్రీ సంవత్సరంలో జరిగిన కర్బలా ఘటన మానవత్వ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. మండపేట కలువపువ్వు సెంటర్ లో ఉన్న ప్రసిద్ధ హనఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్ లో మొహరం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ఫాతిహా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1448 సంవత్సరాల క్రితం జరిగిన కర్బలా సంఘటన ఇప్పటికీ ప్రజల హృదయాల్లో సజీవంగా ఉందన్నారు. మొహరం పదో రోజును “ఆషూరా”గా స్మరించుకుంటారని తెలిపారు. ఇమామ్ హుస్సేన్ ఆయన కుటుంబ సభ్యులకు భక్తులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయ మహా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లెం వారి తరవాత ఇస్లాం రాజ్యాన్ని పాలించిన ఖలీఫా లు ఖురాన్ అనుసరించి పాలన సాగించారని పేర్కొన్నారు. అనంతరం ఏజీద్ అనే రాజు క్రూరంగా వ్యవహరించి ఇస్లాం రూపు రేఖలు చెరిపే పని చేపట్టడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇస్లాం పరిరక్షణ ధ్యేయం గా ఇమామ్ హుస్సేన్ తన పరివారం తో శత్రువు పై యుద్ధం చేస్తారని పేర్కొన్నారు. ఆ యుద్ధం లో చిన్నారులు సైతం వీర మరణం పొంది చరిత్ర లో నిలిచిపోతారని చెప్పారు. చివరి కు ఇమామ్ హుస్సేన్ కూడా వీర మరణం పొందుతారన్నారు. యుద్ధం అనంతరం మిగిలిన కొద్ది మంది ఆయన కుటుంబ పరివారం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆనాటి చారిత్రక ఘట్టాన్నీ వివరించారు. ప్రాణం తృణపాయం గా త్యజించిన ఈ ఇస్లాం మతం లో ఏముంది అని ఆలోచించిన ప్రజలు ఖురాన్ పఠనం, నమాజ్ ద్వారా ఇస్లాం లో వేల సంఖ్య లో అప్పట్లో ప్రవేశించారని పేర్కొన్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా కోటను కోట్లు మంది ఇస్లాం అనుసరించే వారు ఉన్నారన్నారు. దీనికి కారణం అప్పటి ఇమామ్ హుస్సేన్ త్యాగమే అని కొనియాడారు. అనంతరం సలాం, దారుద్ అనంతరం ఫాతిహా నిర్వహించారు. అమరవీరుల పేరు పేరునా నివాళి అర్పించి వారి త్యాగాలను మననం చేశారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### స్పెషల్ ఇన్సెంటివ్ రివ్యూ నమోదులో

# అప్రమత్తంగా ఉండాలి

**పార్లమెంట్ అబ్జర్వర్ గురుమూర్తిరెడ్డి**
**మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇన్సెంటివ్ రివ్యూ (ఎస్ఐఆర్)పై అవగాహన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్నికల ఓట్ల సవరణ జాబితాలో పేర్లు ఉండేలాగా ముఖ్యంగా వైసిపి పార్టీకి చెందిన సానుభూతి పరులు, మద్దతుదారుల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని రాజమండ్రి పార్లమెంట్ అబ్జర్వర్ గురుమూర్తి రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివ్యూ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం పై నగర వైస్సార్సీపీ వార్డ్ ఇంచార్జిలు, బూత్ లెవెల్ ఏజెంట్లు లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక పార్టీ కార్యాలయంలో వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఇన్సెంటివ్ రివ్యూ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమం పై వార్డు అబ్జర్వర్స్, వార్డు ఇంచార్జీలు, బూత్ లెవెల్ ఏజెంట్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్లమెంట్ అబ్జర్వర్ గురుమూర్తి రెడ్డి , నియోజకవర్గ అబ్జర్వర్ అద్దంకి ముక్తేశ్వరరావు, ఎస్ ఐ ఆర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పరమేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన పోర్టల్ లో ఓట్లు నమోదు కొరకు ఎపిక్ నెంబర్, మొబైల్ నెంబర్ తో లాగిన్ కావాలని అన్నారు. బి ఎల్ ఏలు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వాలని అది అది సమాచారం పూర్తి చేసి పోర్టల్ లో సబ్మిట్ అయినట్లు బిఎల్వోలను అడిగి నిర్ధారించుకోవాలన్నారు. 2002 నాటి జాబితాలో పేర్లలో అడ్రస్లు, మార్పులు చేర్పులు పరిశీలించుకోవాలని అన్నారు. పార్టీ పరంగా అధిష్టానం ఇచ్చిన వాట్సాప్ గ్రూపుల్లో సభ్యులు, బాధ్యులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారం మార్పిడి చేసుకుంటూ ఉండాలని సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీ భారత్ మాట్లాడుతూ సర్ కార్యక్రమం పట్ల పార్టీ వార్డు ఇన్చార్జిలు, బిఎల్ఏలు బాధ్యతతో పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను పార్టీ నాయకుల దృష్టికి తీసుకురావాలని, అధికార పార్టీ నాయకులు, అధికారులు కలిసి చేసే తప్పులను నిరంతరం గమనించాలన్నారు. వైసిపి నాయకులు కార్యకర్తలను అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులతో భయ భ్రాంతులకు గురి చేసిన మనోధైర్యం కోల్పో వద్దన్నారు. ఈవీఎం ఎమ్మెల్యే దమనకాండ, కక్ష సాధింపు చర్యలు నగరంలో ఎక్కువైందని, అవన్నీ రానున్న రోజుల్లో తిరిగి రెట్టింపు స్థాయిలో బహుమతులు ఇచ్చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నల్లజర్ల పీఎంపీల నూతన కమిటీ ఏర్పాటు



**నల్లజర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** పీఎంపీలు నిబద్ధతతో అందించే సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు అన్నారు.శుక్రవారం కమ్యూనిటీ పారామెడిక్స్ & ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండల సర్వసభసమావేశం, కార్యవర్గ ఎన్నికలు జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన పోతవరం రాజీవ్ గాంధీ కళ్యాణమండపంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్లెల్లో ఎవరికి ఏ అనారోగ్యం వచ్చిన ముందుగా సంప్రదించేది పీఎంపీలనే నని, ప్రతి పీఎంపీ నిబద్ధతతో సేవలందించాలని అదే మనకు గుర్తింపునిస్తుందని అన్నారు. జిల్లా కార్యదర్శి పి దేవానందం మాట్లాడుతూ మండలం లో ప్రతి నెల వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులు ఏర్పాటు చేసుకుని వ్యాధుల పట్ల నూతన వైద్య విధానాల పట్ల అవగాహన పొందాలని సూచించారు.అనంతరం జరిగిన మండల కార్యవర్గ ఎన్నికలలో బోడిగడ్ల సీతారాములు మండల నూతన కమిటీ అధ్యక్షులుగాను,అరిగెల ధనుంజయరావు మండల నూతన కమిటీ కార్యదర్శిగా, గుంట్రెడ్డి రమణ మూర్తి నూతన కమిటీ కోశాధికారిగా సీహెచ్ నాగ సత్య సాయిబాబు ఉపాధ్యక్షులు గా,అయ్యంకి రామకృష్ణా రావు సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం జరిగింది.ఈ నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి పీ దేవానందం,జిల్లా కోశాధికారి పి చిన్ని సభ్యులు అభినందించారు.నూతనంగా సభ్యంత్వం తీసుకున్న వారికి అసోసియేషన్ సావనీర్ లను అందజేశారు.ఈ కార్యక్రమంలో రత్నబాబు,బ్రహ్మం,వెంకటరత్నం, ఎమ్ఎస్ఆర్ మూర్తి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి





**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జూన్ 28 వ తారీకు ఆదివారం రోజున జరప తలపెట్టిన పల్స్ పోలియో కార్యక్రమంలో సీతానగరం మండలంలో గల ఐదు సంవత్సరముల లోపు ఉన్న5883 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.భవాని అన్నారు. దీనికోసం మండలంలో అన్ని గ్రామాలలో పోలియో చుక్కలు వేయడానికి మొత్తం 38 బూత్ లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రయాణంలో ఉన్న పిల్లలకు పోలియో చుక్కలు వేయడం కోసం సీతానగరం బస్టాండులో ఒక బూత్ మరియు ఇటుక బట్టీలు వంటి హైరిస్క్ ఏరియా ల దగ్గర ఉన్న పిల్లల కోసం మొబైల్ టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 175 మంది వైద్య ఆరోగ్య సిబ్బంది మరియు ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొంటున్నారని ఆదివారం రోజు పిల్లలందరికీ విధిగా చుక్కలు వేయించాలని ఎవరైనా పిల్లలు చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోతే 29వ తేదీన, 30వ తేదీన వ్యాక్సినేషన్ టీంలు ఇంటింటికి వెళ్లి ప్రతి ఇంటిలోని పిల్లలందరికీ వ్యాక్సినేషన్ అందిందా లేదా అని తనిఖీ చేసి వ్యాక్సిన్ వేయించుకోని పిల్లలకు ఇంటి దగ్గరే పోలియో వ్యాక్సిన్ వేస్తారని చెప్పినారు. ఈ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి అందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాముల వ్వాలని తెలియజేశారు.



### ఈ సెప్టెంబర్ నాటికే..

# 'వారణాసి'పై రాజమౌళి బిగ్ అప్డేట్





దర్శక ధీరుడు రాజమౌళి, సూపర్ స్టార్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న సినిమా 'వారణాసి'. అడ్వెంచెరస్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్టు గురించి రాజమౌళి ఓ కీలక అప్డేట్ ఇచ్చారు. గుంటూరు కారం తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు నటిస్తోన్న సినిమా 'వారణాసి'. ఆర్ఆర్ఆర్ వంటి గ్లోబల్ హిట్ తర్వాత దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి చేపట్టిన ప్రాజెక్టు ఇదే. దీంతో ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకు తగ్గట్టుగానే ఈ మూవీ నుంచి ఇప్పటిదాకా వచ్చిన పోస్టర్స్, గ్లింప్స్ సినిమాకు మరింత హైప్ ఇచ్చాయి. భారీ బడ్జెట్తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న వారణాసి సినిమాలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ అనే పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే చాలా ఏళ్ల తర్వాత ప్రకాశ్ రాజ్ మళ్లీ రాజమౌళి నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా గురించి డైరెక్టర్ రాజమౌళి ఒక బిగ్ అప్డేట్ ఇచ్చారు. 'వారణాసిలో ముఖ్యమైన షూటింగ్ పార్ట్ ను పూర్తిచేశాం. సినిమాలోని భారీ విజువల్ స్పెక్టకిల్ యాక్షన్ సీక్వెన్స్లన్నీ చిత్రీకరించాం. ప్రస్తుతం కథను అనుసంధానించే చిన్న చిన్న సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోంది. మిగిలిన భాగాన్ని పూర్తి చేయడానికి కూడా ఎక్కువ సమయం పట్టదు. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది' అని రాజమౌళి చెప్పుకొచ్చారు. కాగా వారణాసి సినిమాను ఐమాక్స్ ఫార్మాట్లో రూపొందించడంపై జక్కన్న ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.. ' మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్లో షూట్ చేయడానికి అలవాటు పడ్డాయి. నాకు కూడా అది ఇష్టమే. అయితే వారణాసి కథ ఐమాక్స్లో అయితే అద్భుతంగా ఉంటుందని మొదటి నుంచి అనుకుంటున్నాం. అలాగనీ ఈ ఫార్మాట్ కోసం మాత్రం 'వారణాసి' కథలో మార్పులు చేయలేదు. చిన్న చిన్న సర్దుబాట్లు మాత్రమే చేశాం. అటు ఐమ్యాక్స్, ఇటు సినిమా స్కోప్నకు సరిపోయేలా సన్నివేశాలను ఫ్రేమ్ చేస్తున్నాం' అని రాజమౌళి పేర్కొన్నారు. ప్రస్తుతం జక్కన్న కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. దీనిపై నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. జక్కన్న కెరీర్ లో త్వరగా పూర్తికానున్న సినిమా ఇదేనేమో అంటూ నెటిజన్లు స్పందిస్తున్నారు. కాగా 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా వారణాసి సినిమా విడుదల కానుంది.

### 'సమంత ప్రెగ్నెన్సీ గురించి

# నాకు ముందే తెలుసు.. ఎవరికీ చెప్పలేదు'



హీరోయిన్ సమంత ప్రస్తుతం ఫుల్ జోష్లో ఉంది. ఆమె నటించిన మా ఇంటి బంగారం సినిమా సూపర్ హిట్ కావడం ఒక కారణమైతే త్వరలోనే ఆమె తల్లిగా ప్రమోషన్ పొందనుండడం మరో కారణం. అయితే సమంత ప్రెగ్నెన్సీ గురించి ఒక ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. సమంత ఇటీవల తన ఫ్యాన్స్ కు డబుల్ సర్ ప్రైజ్ ఇచ్చింది. 'మా ఇంటి బంగారం' సినిమాతో మరో సూపర్ హిట్ ను తన ఖాతాలో వేసుకున్న ఈ అందాల తార ఆ వెంటనే తాను ప్రెగ్నెన్సీతో ఉన్నానంటూ మరో గుడ్ న్యూస్ పంచుకుంది. దీంతో సామ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. అలాగే పలువురు సినీ ప్రముఖులు, నెటిజన్లు సమంత-రాజ్ నిడిమోరు దంపతులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే సమంత ప్రెగ్నెన్సీ గురించి మా ఇంటి బంగారం సినిమా డైరెక్టర్ నందిని రెడ్డి ఒక ఆసక్తికర విషయాన్ని బయట పెట్టింది. అదేంటంటే.. మా ఇంటి బంగారం సినిమా షూటింగ్లో ఉన్నప్పుడే సామ్కు ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయ్యిందట. అయితే అప్పటికే సినిమాలోని యాక్షన్ సీన్స్ మొత్తం షూట్ చేశారట. దీంతో షూటింగ్కు ఎలాంటి ఇబ్బంది రాలేదని నందిని రెడ్డి పేర్కొంది. ఇక మిగిలిన షూటింగ్ లో సమంతకు కొంచెం ఎక్కువ విశ్రాంతి నిస్తూ పూర్తి చేశామని నందిని రెడ్డి చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. ఇక మా ఇంటి బంగారం సినిమా విషయానికి వస్తే.. రెండో వారంలోనూ ఈ సినిమా కలెక్షన్ల జోరు కొనసాగుతోంది. ఇప్పటికే ఈ మూవీ రూ.55 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించింది. అటు ఓవర్సీస్ లోనూ ఈ మూవీ వసూళు 2 మిలియన్ డాలర్స్ ను అధిగమించాయని తెలుస్తోంది. ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్ టైనర్ సినిమాలో సమంతతో సహా భారీ తారగణమే ఉంది. శ్రీముఖి, గౌతమీ, ఆనంద్, లక్ష్మీ, శ్రీనివాస గవిరెడ్డి, మంజూష, దిగంత్, గుల్షన్ దేవయ్య తదితరులు ఈ మూవీలో వివిధ పాత్రల్లో కనిపించారు. ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా మా ఇంటి బంగారం సినిమాను నిర్మించారు. సంతోష్ నారాయణన్ ఈ సినిమాకు స్వరాలు అందించారు.

# ఐర్లాండ్తో తొలి టీ20.. భారత్ లక్ష్యం 183 పరుగులు



తొలి టీ20లో భారత్కు ఐర్లాండ్ 183 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లొర్కాన్ టక్కర్ (50) హాఫ్ సెంచరీ సాధించాడు. డాక్రెల్ (49) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్ 2, అర్ష్దీప్ సింగ్ 2, శివమ్ దూబే ఒక వికెట్ తీశారు. ఐర్లాండ్ బ్యాటర్ డెలానీ (49) ఒక్క పరుగు తేడాతో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. అర్ష్దీప్ సింగ్ వేసిన 18.6వ ఓవర్ను షాట్కు యత్నించిన డెలానీ అక్షర్ పటేల్ చేతికి చిక్కాడు. అనంతరం 19.1వ ఓవర్లో అక్షర్ పటేల్ వేసిన బంతిని మెక్కార్తీ భారీ షాట్కు యత్నించాడు. కానీ, బౌండరీ లైన్ వద్ద తిలక్ అద్భుతంగా ఒడిసిపట్టాడు. ప్రస్తుతం ఐర్లాండ్ స్కోరు 179/8. అక్షర్ పటేల్కు వికెట్ దక్కింది. ఐర్లాండ్ బ్యాటర్ డాక్రెల్ (19) ఇచ్చిన క్యాచ్ను బ్యాక్వర్డ్ పాయింట్లో అర్ష్దీప్ సింగ్ ఈజీగా పట్టేశాడు. దీంతో 17.1వ ఓవర్లలో 164 పరుగుల వద్ద ఐర్లాండ్ ఆరో వికెట్ను నష్టపోయింది. ప్రస్తుతం ఐర్లాండ్ స్కోరు 18 ఓవర్లకు 167/6. క్రీజ్లో డెలానీ (44బి), మెక్కార్తీ (2బి) ఉన్నారు. దూకుడుగా ఆడి హాఫ్ సెంచరీ చేసిన లొర్కాన్ టక్కర్ (50) పెవిలియన్కు చేరాడు. హర్షిత్ రాణా (14.3వ ఓవర్) వేసిన బంతిని షాట్ కొట్టబోయిన టక్కర్ డీప్ ఫీల్డర్ తిలక్ వర్మ చేతికి చిక్కాడు. దీంతో 115 పరుగుల వద్ద ఐర్లాండ్ ఐదో వికెట్ను నష్టపోయింది. హర్షిత్కు ఇది మూడో వికెట్. తన నాలుగు ఓవర్ల కోటాలో 24 పరుగులు ఇచ్చాడు. ప్రస్తుతం ఐర్లాండ్ స్కోరు 15 ఓవర్లకు 118/5. క్రీజ్లో డాక్రెల్ (2బి), డెలానీ (16బి) ఉన్నారు. ఐర్లాండ్ బ్యాటర్ టక్కర్ హాఫ్ సెంచరీ సాధించాడు. ఓ వైపు వికెట్లు పడినా.. నిలకడగా ఆడాడు. 35 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేశాడు. ప్రస్తుతం ఐర్లాండ్ స్కోరు 14 ఓవర్లకు 111/4. చేతిలో పడిన క్యాచ్ను అభిషేక్ శర్మ వదిలేశాడు. ఐర్లాండ్ ఇన్నింగ్స్లో 11వ ఓవర్ను అక్షర్ పటేల్ వేశాడు. చివరి బంతికి డెలానీ (11బి) భారీ షాట్కు యత్నించాడు. బౌండరీ లైన్ వద్ద అభిషేక్ క్యాచ్ను అందుకొన్నట్లే కనిపించాడు. కానీ, ఆఖర్లో బంతి చేజారింది. దీంతో డెలానీ బతికిపోయాడు. ప్రస్తుతం 13 ఓవర్లకు ఐర్లాండ్ స్కోరు 102/4. క్రీజ్లో డెలానీతోపాటు టక్కర్ (43బి) ఉన్నాడు. అక్షర్ వేసిన 13వ ఓవర్లో టక్కర్ రెండు ఫోర్లు, సిక్స్ బాదాడు. ఐర్లాండ్ ఇన్నింగ్స్లో 10 ఓవర్లు ముగిశాయి. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు రాబట్టడం వారికి కష్టమైంది. ప్రస్తుతం ఐర్లాండ్ స్కోరు పది ఓవర్లకు 68/4. క్రీజ్లో లొర్కాన్ టక్కర్ (13బి), గారెత్ డెలానీ (7బి) ఉన్నారు. శివమ్ దూబే మంచి బౌలింగ్ వేస్తుండగా.. ప్రసిద్ధ్ కృష్ణ కాస్త ఎక్కువగా పరుగులు సమర్పించాడు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రయోగం ఫలించింది. శివమ్ దూబేను రంగంలోకి దింపగా.. తొలి బంతికే వికెట్ తీశాడు. దూబే వేసిన 7.1 ఓవర్లో బెంజమిన్ (15) భారీ షాట్కు యత్నించాడు. బౌండరీ లైన్ వద్ద ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా ఒడిసిపట్టాడు. దీంతో 51 పరుగుల వద్ద ఐర్లాండ్ నాలుగో వికెట్ను నష్టపోయింది. హర్షిత్ రాణా అద్భుతమైన బౌలింగ్తో ఆకట్టుకుంటున్నాడు. తన వరుస ఓవర్లో మరో వికెట్ తీశాడు. ఐర్లాండ్ ఓపెనర్ టిమ్ టెక్టర్ (17)ను పెవిలియన్కు పంపాడు. హర్షిత్ వేసిన 3.4వ ఓవర్లో షాట్కు యత్నించి మిడాఫ్లో శ్రేయస్కు టెక్టర్ దొరికిపోయాడు. దీంతో 30 పరుగుల వద్ద ఐర్లాండ్ మూడో వికెట్ను నష్టపోయింది. ప్రస్తుతం ఐర్లాండ్ స్కోరు 4 ఓవర్లకు 30/3. ఐర్లాండ్కు రెండో ఓవర్లోనే షాక్ తగిలింది. హర్షిత్ రాణా వేసిన బంతిని (1.5వ ఓవర్) ఆడబోయిన ఓపెనర్ రాస్ అడైర్ (12) వికెట్ కీపర్కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 20 పరుగుల వద్ద ఐర్లాండ్ తొలి వికెట్ను నష్టపోయింది. మూడో ఓవర్ చివరి బంతికి హ్యారీ టెక్టర్ (0)ను అర్ష్దీప్ పెవిలియన్కు పంపాడు. ప్రస్తుతం ఐర్లాండ్ స్కోరు 3 ఓవర్లకు 25/2. క్రీజ్లో లొర్కాన్ టక్కర్, టిమ్ టెక్టర్ ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్లోకి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం ఆలస్యం కానుంది. ఐర్లాండ్తో తొలి టీ20 మ్యాచ్కు ప్రకటించిన తుది జట్టులో అతడికి అవకాశం లభించలేదు. దీంతో అతడి అభిమానులకు తీవ్ర నిరాశ ఎదురైంది. మొదటి మ్యాచ్లో టాస్ నెగ్గిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకుని ఐర్లాండ్ను బ్యాటింగ్కు ఆహ్వానించాడు. సమయం వచ్చినప్పుడు తప్పకుండా వైభవ్ అరంగేట్రం చేస్తాడని ఈ సందర్భంగా శ్రేయస్ తెలిపాడు.

**తుది జట్లు**

**భారత్:** అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, అర్ష్దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ

**ఐర్లాండ్:** టిమ్ టెక్టర్, రాస్ ఆడైర్, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్ (కెప్టెన్/వికెట్ కీపర్), బెంజమిన్ కాలిట్జ్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, లియామ్ మెక్కార్తీ, మాథ్యూ హంఫ్రేయ్స్, జ మూంద్రా, మాథ్యూ హోలార్డ్.

# లక్ష్యం 183 రన్స్.. సంజు, ఇషాన్ ఔట్.. అభిషేక్ దూకుడు

తొలి టీ20లో ఐర్లాండ్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్య ఛేదనకు భారత్ దిగింది. అయితే, రెండో ఓవర్ తొలి బంతికే టీమ్ఇండియా వికెట్ను కోల్పోయింది. ఓపెనర్ సంజు శాంసన్ (5)ను ఐర్లాండ్ బౌలర్ మూంద్రా క్లీన్బౌల్డ్ చేశాడు. అంతకుముందు మాథ్యూ వేసిన తొలి ఓవర్లో 16 పరుగులు వచ్చాయి. వికెట్ పడినా అభిషేక్ శర్మ (46బి) మాత్రం దూకుడుగా ఆడుతున్నాడు. బౌండరీలతో ఐర్లాండ్ బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు.

మెక్కార్తీ వేసిన మూడో ఓవర్లో నాలుగు ఫోర్లు సహా 21 పరుగులను రాబట్టాడు. అయితే, నాలుగో ఓవర్లో రెండో బంతికి ఇషాన్ కిషన్ (1)ను మాథ్యూ ఔట్ చేశాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 4 ఓవర్లకు 57/2. క్రీజ్లో అభిషేక్ శర్మతోపాటు శ్రేయస్ అయ్యర్ ఉన్నాడు.



### ముగిసిన రెండో రోజు ఆట..

## శ్రీలంక-ఏపై భారత్దే ఆధిపత్యం



అనధికారిక టెస్టులో శ్రీలంక-ఏ జట్టుపై భారత్-ఏ ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి శ్రీలంక 31 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. భారత్ కంటే ఇంకా 339 పరుగులు వెనుకబడి ఉంది. క్రీజ్లో నువానిదు ఫెర్నాండో (65బి), ఆష్టేన్ బండారా (18బి) ఉన్నారు. ఓపెనర్లు పవాంత వీరసింగే (11), నిరోషన్ డిక్వెల్లా (10) విఫలమయ్యారు. భారత్-ఎ బౌలర్లు అన్షుల్ కాంబోజ్, యశ్ ఠాకూర్ చెరో వికెట్ తీశారు. అంతకుమందు టీమ్ఇండియా- ఎ తొలి ఇన్నింగ్స్ను 452/6 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది.

**కెప్టెన్ ధ్రువ్ జురెల్ కూడా సెంచరీ**

తొలి రోజే సాయి సుదర్శన్ (132) సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. ఓవర్ నైట్ 333/4 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ కాసేపటికే షేక్ రషీద్ (63) రూపంలో వికెట్ కోల్పోయింది. అయితే, కెప్టెన్ ధ్రువ్ జురెల్ (141బి) అద్భుత సెంచరీతో జట్టు స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అతడికి హర్ష్ దూబే (30) సహకారం అందించాడు. చివరి భారత్ స్కోరు 450ం దాటగానే ఇన్నింగ్స్ను డిక్లేర్ చేస్తూ ధ్రువ్ నిర్ణయం తీసుకున్నాడు. శ్రీలంక బౌలర్లలో చమిక గుణశేఖర 3, దిలుమ్ సుదీరా 2, రవిందు ఫెర్నాండో ఒక వికెట్ తీశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com